ఆంధ్రజ్యోతి
****

ANDHRAJYOTHY



నల్లగొండ

5

ఆదివారం 22 డిసెంబరు 2024

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత   గరిష్ఠం 28.0 | కనిష్ఠం 18.4

ఆ అత్తా కోడళ్లు వంటలు చేస్తూ తీసిన వీడియోలను యూట్యూబ్‌లో లక్షల మంది వీక్షిస్తున్నారు. ఈతరం వారికి రుచే కాదు పేర్లూ తెలియని వంటకాలనూ వీడియోల ద్వారా వీరు పరిచయం చేస్తున్నారు. ఆ అత్త తన కోడలికి ఆ వంట ఎలా చేయాలో? ఏ సీజన్‌లో ఏ వంటను ఎలా వండాలో వివరిస్తూ వీడియో చూసేవారికి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తుండడం వీరి ప్రత్యేకత. అద్భుతమైన రుచి వచ్చేలా వంట చేసేవిధానం, అందులో ఉపయోగించే పదార్థాలను వివరించడంతో పాటు, వంట చేసే క్రమంలో అత్తాకోడళ్ల మధ్య సరదా సంభాషణ, ఆ వంటకు అనుసంధానమయ్యేలా సాగే పిట్ట కథలు, సామెతలు వీక్షకులను రంజింపజేస్తున్నాయి. 'చెఫ్ సరూ' యూట్యూబ్ ఛానల్ ద్వారా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రానికి చెందిన సరస్వతి, ఆమె అత్త సైదమ్మ ప్రాచుర్యం పొందడంతోపాటు వారికంటూ ఓ ప్రత్యేకతను సాధించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

కొత్త బంధం.. పాత వంట

వంట చేస్తున్న అత్తాకోడలు సైదమ్మ, సరస్వతి



- యూట్యూబ్‌లో అత్తాకోడళ్ల వంటల విందు
- వ్యూస్‌తో దూసుకెళ్తున్న చెఫ్ సరూ
- కోడలికి వంట నేర్పే క్రమంలో మొదలైన ఆలోచన

సైదమ్మ కోడలు సరస్వతికి తొలినాళ్లలో అంతగా వంటలు వచ్చేవి కావు. దీంతో సైదమ్మ ఏ వంట ఎలా చేయాలి? ఎలా వండాలి? ఏ వంటలో ఉండే ప్రత్యేకతలేంటి? ఏ పదార్థాలు ఏ మోతాదులో వాడితే ఆ వంట రుచికరంగా ఉంటుంది? అనే విషయాలను కోడలికి వివరించేది. అలా కోడలికి వంట నేర్పే సమయంలో వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేద్దామని ఆమె కుమారుడు నరేష్ సలహా ఇచ్చాడు. తొలుత సైదమ్మ వారించడంతోపాటు, తనకు చదువురాదని, తాను చేసే వంటలు వేరేవాళ్లు ఎందుకు చూస్తారని బిడియపడింది. కానీ ఆమె కుమారుడు, కోడలు ఒప్పించి వంటల వీడియోలు తీసి అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టారు. అనూహ్యంగా వాటికి ఆదరణ లభించింది. తొలుత వీడియోలకు నెటిజన్లు ప్రతికూల కామెంట్లు పెట్టగా, ఓపిగ్గా వారికి సమాధానమిస్తూ ఆ సమస్యను అధిగమించారు. ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని సరస్వతి తెలిపింది. కోడలినైనా తనను సొంత కూతురిలా అత్త సైదమ్మ చూసుకుంటోందని, వీడియోలు చూసేవాళ్లు పలువురు తమను అత్తాకోడళ్లేనా? అని అనుమానపడి అడుగుతుంటారని చెప్పింది. అత్త చేసే వంటలు, చెప్పే విధానంతోనే తాను కూడా వంట నేర్చుకున్నానని సరస్వతి తెలిపింది. తన భర్త నరేష్ డిజిటల్ మీడియాలో పనిచేస్తుండటం, అతడి ఆలోచన నుంచే ఈ యూట్యూబ్ వీడియోలు చేయాలని నిర్ణయించామని, కుటుంబ సభ్యుల పూర్తి మద్దతు వల్లే ఈ సక్సెస్ సాధించామని, వీడియోల రూపకల్పన సమయంలో అందరూ సహకరిస్తారని సైదమ్మ, సరస్వతి వెల్లడించారు.

త్వరలో ఫ్రాంచైజీల ఏర్పాటుకు సన్నాహాలు

వంట నచ్చిన చాలా మంది వాటిని వండి కొరియర్ చేయాలని కోరడంతో వీరు ఆ సేవలు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి గాజు సీసాల్లోనే పచ్చళ్లను వీరు అందిస్తున్నారు. వారు చేసే వివిధ వంటలను ఆఫ్‌లైన్‌లో ఫ్రాంఛైజీల ద్వారా కూడా విక్రయించాలని పలువురు కోరుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా 40కి పైగా కేంద్రాల్లో ఫ్రాంఛైజీలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సరస్వతి తెలిపారు. బెల్లంటీతో పాటు ఆ ఫ్రాంఛైజీల్లో వీరి వంటకాలను కూడా అందుబాటులో ఉంచుతామని, దీని ద్వారా అత్త సైదమ్మ వీడియోల్లో చేసి చూపించే కూరలు, పచ్చళ్లు, ఇతర వంటకాలు అందరికీ అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

ఈ తరానికి తెలియని పాత వంటకాలకే ప్రాధాన్యం

సైదమ్మకు చిన్నప్పటి నుంచే వంటలు చేయడంలో పేరుంది. చిన్నప్పుడు అమ్మ వద్ద, అమ్మమ్మ, నాయనమ్మల వద్ద ఆమె ఎన్నో వంటలు చేయడం నేర్చుకుంది. వారి కుటుంబంలో ఏ ఫంక్షన్ అయినా ఆమెనే వంటలు చేసేది. వారి కుటుంబం పెద్దది కావడంతో రోజూ అందరికీ రుచికరమైన వంట చేసి పెట్టడం ద్వారా చక్కని వంట చేయడం అలవాటైంది. ప్రధానంగా ఈ తరానికి అంతగా తెలియని పాతకాలపు వంటలను వారి వీడియోల్లో వండి చూపిస్తుండటంతో వీక్షకుల ఆదరణ పెరిగింది. కొరమీను, కంది పచ్చడి, ఉలవ పచ్చడి, నల్లేరు పచ్చడి, ఆముదాల పాలతో సొరకాయ పచ్చడి, ఉలవచారు, ఉలవ రొట్టె, నాటుకోడి, రాగి అన్నం, సజ్జ అన్నం, మటన్ పులుసు వంటి వెరైటీ వంటకాల వీరి వీడియోలు ఎక్కువగా ప్రాచుర్యం...

- మిగతా 7వ పేజీలో...



ఆవిరైన ఆనందం

- కొద్దిసేపట్లో గమ్యాలకు చేరుకునే లోపే అనంతలోకాలకు..
- డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు
- ఉర్సు ఉత్సవాలలో ఆనందంగా గడిపి అంతలోనే విషాదం
- స్పీడు బ్రేకర్లు లేకపోవడం, డ్రైవర్ అతివేగమే కారణం



7

ఘటనాస్థలిలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం, కారణమైన డీసీఎం

వ్యవస్థీకృత నేరాల అదుపునకు చర్యలు

- ధాన్యం అక్రమ రవాణా అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 24 చెక్‌పోస్టులు
- పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్
- రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్‌హెచ్‌వోగా మార్పు
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ వి.సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా లాంటి వ్యవస్థీకృత నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు మల్టీజోన్-2, యాదాద్రి ఇన్‌చార్జి డీఐజీ జోన్-5 వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించి కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందితో మాట్లాడి విధుల గురించి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండగా, దళారులు, కొందరు మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు ఫామ్-10 ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెచ్చి రైతుల పేరుతో అక్రమంగా విక్రయించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. వారిని కట్టడి చేసేందుకు సీఎం ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి పోలీస్‌శాఖ కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలో 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ధాన్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. రైతుల పేరుతో మిల్లులకు ముతక ధాన్యం రవాణా చేస్తున్నామని దళారీలు సన్నధాన్యం తరలించేందుకు ప్రయత్నాలు చేయగా, పట్టుకొని వెనక్కి పంపామన్నారు. మరోసారి అలాగే చేస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. రూరల్ పరిధిలో ఈ ఏడాది 18 పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు నమోదు చేశామన్నారు. పేదల వద్ద చౌకగా కొనుగోలుచేసి రీసైక్లింగ్ అనంతరం విక్రయించే రైస్ కింగ్‌పిన్‌ల కోసం వేట సాగుతోందన్నారు. అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపేందుకు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జోన్-2 పరిధిలో ఇప్పటికే రెండు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మిర్యాలగూడలో సైబర్ క్రైమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేసుల పరిష్కారానికి స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాకు 80శాతం మేర తగ్గించినట్లు తెలిపారు. సుమారు వంద గ్రామాలకు ఎస్‌ఐ ఎస్‌ఎచ్‌వోగా ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడా లేనంతగా కేసుల సంఖ్యను పెరిగినందున స్టేషన్‌ను సీఐ ఎస్‌హెచ్‌ఓగా మార్పు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో మూడు ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. ఒక నక్సలైట్ లొంగిపోగా అతడి నడవడికపై నిఘా పెట్టడంతోపాటు ఫ్యాక్షన్ గ్రామాల్లో సంఘటనలు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరిందని, అన్ని హంగులతో కూడిన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాని తెలిపారు. కార్యక్రమంలో రూరల్, వన్‌టౌన్ సీఐలు వీరబాబు, కరుణాకర్, ఎస్‌ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు వద్ద పటిష్ఠ బందోబస్తు

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): సరిహద్దుల్లో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం దామరచర్ల మండలం వాడపల్లి వద్ద రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పరిశీలించి ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రవాణాను రాష్ట్రంలోకి అనుమతించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. సరిహద్దు గుండా అక్రమ రవాణా జరగకుండా నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ వీరబాబు, ఎస్‌ఐ హరికృష్ణ ఉన్నారు.


బ్రాహ్మణవెల్లెంల కాల్వ పనులు ప్రారంభించాలి



ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు ఎడమ కాల్వ పనులను ఈనెల 25లోపు పూర్తిస్థాయిలో ప్రారంభించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కింద కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.32కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ప్రత్యేకించి ఎడమకాల్వ పనులు ప్రారంభించాలన్నారు. ఈ కాల్వ వెళ్లే భూములకు సంబంధించి రైతుల నుంచి సేకరించిన పాస్ పుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు,అక్విటెన్స్‌లు సమర్పించి ఈ నెల 25లోగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ విఠలేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీటీసీగా వాణి బాధ్యతల స్వీకరణ



నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఎస్.వాణి శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఉప్పల్ ఆర్టీవోగా పనిచేస్తున్న ఆమె పదోన్నతితో జిల్లా డీటీసీగా వచ్చారు. ఇప్పటి వరకు డీటీసీగా పనిచేసిన సురేష్‌రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఈవో భిక్షపతి



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

గుర్రంపోడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు లేకుండా శుభ్రం చేయించాలని పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు. ఎలుకలు, పాములు ప్రవేశించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, స్టోర్‌రూమ్, కిచెన్‌లను తనిఖీచేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నోముల యాదగిరి, పాఠశాల ప్రత్యేకాధికారి విజయశ్రీ, తదితరులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్



పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీడీ రాజ్‌కుమార్

గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, హాకీ, ఫోర్స్ ఫిట్నెస్ క్లబ్‌లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు. ఐదు రోజుల పాటు నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో వివిధ మండల స్థాయిలో ఎంపికైన బాల, బాలికలు ప్రతిభను కనబర్చారన్నారు. పలు క్రీడాంశాల్లో జిల్లాకు చెందిన యువకులు, విద్యార్థులు, బాలికలు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ, సీఎంకప్-2024 జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో 4వేల మంది యువకులు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈనెల 27 నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను పంపుతామన్నారు. హ్యాండ్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్ర మంలో డీవైఎస్‌వో నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఇందిరా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, అథ్లెటిక్స్, హాకీ, అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు టీ.శంభులింగం, కరీం, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, పుల్లయ్య, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, మాణిక్యం, నాగరాజు, శ్రీనివాస్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు సంక్లిష్టతలను సులభతరం చేస్తాయి

ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు సంక్లిష్టతలను సులభతరం చేస్తామని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎంజీయూలో 10రోజుల రీసెర్చ్ మెథడాల జీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేనేజ్‌మెంట్ విభాగం జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం ఆధ్యాపకులను, పరిశోధకులను భాగస్వాములను చేయడం ద్వారా ఎంజీయూ ప్రతిష్ఠ పెరుగుతోందన్నారు. రిజిస్ట్రార్, కోర్సు కోఆర్డినేటర్ అల్వాల రవి మాట్లాడుతూ, జాతీయ స్థాయి కార్యక్రమం ప్రేరణగా మరికొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మిర్యాల రమేష్, సరిత, వెంకటరమణారెడ్డి, లక్ష్మీప్రభ, నబీనా హెరాల్డ్, శ్వేత, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బుద్ధవనంలో విద్యార్థుల సందడి



బుద్ధవనం సందర్శనకు వచ్చిన విద్యార్థులు

నాగార్జునసాగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకులు, విద్యార్థుల సందడి నెలకొంది. సాగర్‌లో పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, అనుపు, ఎత్తిపోత ల, కొత్త వంతెన, పాత వంతెన, విజయవిహార్ తదితర ప్రాంతాల్లో పర్యాటకులు, విద్యార్థులు సందడి చేశారు. బుద్ధవనం సందర్శనకు జిల్లాకు చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు.

చివరి దశకు చేరిన

పత్తి కొనుగోళ్లు

6

- మరో 10 రోజుల్లో పత్తి సేకరణ పూర్తి
- క్రమక్రమంగా తగ్గుతున్న దిగుబడులు
- ఇప్పటికే 90శాతంకు పైగా పత్తి విక్రయం
- గత ఏడాది కంటే అధికంగా కొనుగోలు చేసిన సీసీఐ



పత్తి కొనుగోళ్లు లక్ష్యానికి చేరువలో..

- మరో 10 రోజుల్లో పత్తి సేకరణ పూర్తి
- క్రమక్రమంగా తగ్గుతున్న దిగుబడులు
- ఇప్పటికే 90శాతానికి పైగా పత్తి విక్రయం
- అధిక దిగుబడులపై ప్రభావం చూపిన విత్తనాలు



నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్ల ప్రక్రియ చివరి దశకు చేరుతోంది. నవంబరు 4వ తేదీనుంచి పత్తి కొనుగోళ్లను సీసీఐ చేపట్టిన విషయం తెలిసిందే. కొనుగోళ్ల ప్రారంభంలో అకాల వర్షాలతో పత్తికొనుగోళ్ల విషయంలో సందిగ్ధం ఏర్పడింది. తడిసిన పత్తిని కొనుగోలు చేయడానికి సీసీఐ నిరాకరించడంతో సమస్యలు ఏర్పడ్డాయి. అయితే రానురాను కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు తొలగిపోయాయి అని చెప్పవచ్చు. కొన్నిచోట్ల తడిసిన పత్తిని కొనుగోలుచేయాలని రైతులు ఆందోళన కూడా చేసిన సందర్భాలున్నాయి. క్రమేణా ఆ పరిస్థితులనుంచి పూర్తిస్థాయిలో పత్తి కొనుగోళ్లను సీసీఐ జరుపుతుండటంతో రైతులు ఊరట చెందారు. సీసీఐ మద్దతు ధర ఎనిమిది శాతం ఉన్న పత్తికి రూ.7521లను చెల్లిస్తుంది. ఈసారి ఎకరాకు ఆరు క్వింటాళ్లనుంచి ఎనిమిది క్వింటాళ్లవరకు పత్తి దిగుబడి వచ్చింది. వాస్తవానికి అయితే ఎకరానికి 12 క్వింటాళ్ల పత్తి వస్తే రైతులకు మరింత ప్రయోజనం చేకూరి ఉండేది. గతం మూడు, నాలుగేళ్లతో పోలిస్తే వర్షాలు లేకపోవడంతో కేవలం నాలుగు క్వింటాళ్ల దిగుబడి వచ్చిన పరిస్థితి ఉండేది. అప్పట్లో వివిధ కారణాలతో రైతులు నష్టపోయిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్‌లో వేసిన పత్తిచేలకు అడదడపా కురిసిన వర్షాలు రైతులను గట్టెక్కేలా చేసిందని చెప్పవచ్చు.

90శాతానికి పైగా పత్తి విక్రయాలు పూర్తి

పత్తి కొనుగోళ్ల సీసీఐ గత నెలా మొదటి వారం నుంచి చేపడుతుండటంతో ఇప్పటికే రైతులు 90శాతంకు పైగా విక్రయాలు చేసుకున్నారు. రైతులు ఆశించిన స్థాయిలో మద్దతు ధర వస్తుండటంతో దళారులకు పెద్దగా విక్రయాలు చేసినట్లు కనిపించడంలేదు. జిల్లాలో మొత్తం ఏడు ఏఎంసీల పరిధిలో 23జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేపట్టారు. దేవరకొండ ఏఎంసీ పరిధిలో 5, వెంకటేశ్వరనగర్ (మాల్) పరిధిలో 6, చండూరు పరిధిలో 4, నకిరేకల్ ఏఎంసీ పరిధిలో 3,నల్లగొండ పరిధిలో 2, చిట్యాల పరిధిలో 2, శాలిగౌరారం ఏఎంసీ పరిధిలో ఒకటి జిన్నింగ్ మిల్లులో కొనుగోళ్లను చేపట్టారు. మరో 10 రోజుల్లో పత్తి దిగుబడులు పూర్తయి కొనుగోళ్లను కూడా పూర్తిచేసే అవకాశమున్నట్లు సమాచారం. ఇప్పటివరకు మొత్తం 49,917మంది రైతుల నుంచి 1,49,191 మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగా దీనికి సంబంధించి రూ.10.96కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికే రూ.9.32కోట్లను రైతుల ఖాతాల్లో జమచేసింది. గత ఏడాది కంటే అధికంగా ఈసారి లక్ష మెట్రిక్ టన్నుల పత్తి ఇప్పటికే సీసీఐ కొనుగోలు చేపట్టింది. తేమశాతం సమస్యతో మొదట ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వర్షాలు లేకపోవడంతో సమస్యలు తొలగి అటు రైతుల మధ్య గొడవలు లేకుండా అయ్యాయి.

అధిక దిగుబడులు రాకపోవడానికి..

వాస్తవానికయితే ఈ ఏడాది పత్తి దిగుబడులు అధికంగా వస్తాయని రైతులతోపాటు వ్యవసాయ శాఖ అధికారులు భావించారు. బీటీ-2 రకంలో వేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయని అధికారులు ప్రచారం చేశారు. నాన్‌బీటీ అనేది ప్రస్తుతం మార్కెట్‌లో లేదని చెప్పవచ్చు. అయితే బీటీ-2లోనే అనేక రకాల కంపెనీలు మార్కెట్‌లోకి రావంతో రైతులు ఏ విత్తనాలు వేయాలనే దానిపై అయోమయంలో పడ్డారు. చాలామంది రైతులు బూత్‌పూర్‌కు వెళ్లి తక్కువ ధరకు వచ్చే విత్తనాలు తీసుకొచ్చి వేయడంవల్ల కూడా దిగుబడులపై ప్రభావం చూపింది. ప్రభుత్వం గుర్తించని అసలు విత్తనాలు పోలి ఉండే నకిలీ విత్తనాలను రైతులు మోసపోయి కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. గత ఖరీఫ్‌లో చాలాచోట్ల నకిలీ విత్తనాలు వేయడం వల్ల దిగుబడులపై ప్రభావం కనిపించింది. నాణ్యమైన విత్తనాలు వేస్తే ఎకరాకు 12క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చి ఉండేది. కానీ వివిధ రకాల కంపెనీ విక్రయాలతో ఆరు క్వింటాళ్ల నుంచి ఎనిమిది క్వింటాళ్ల వరకు మాత్రమే పత్తి దిగుబడులు వచ్చాయి. అంటే చాలా చోట్ల రైతులు దిగుబడులు రాక నష్టపోయారు.

ఎప్పటికప్పుడూ రైతుల ఖాతాల్లో డబ్బులుజమ

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో 23 జిన్నింగ్ మిల్లుల ద్వారా పెద్దఎత్తున పత్తి కొనుగోళ్లను చేపట్టింది. సీసీఐ ఆధ్వర్యంలో పత్తిని కొనుగోలు చేస్తున్నాం. జిల్లాలో పత్తి కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టేలా మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. ఈసారి పత్తి కొనుగోళ్లకు సంబంధించి మార్కెటింగ్ శాఖ వాట్సప్ ద్వారా సేవలను అందించింది. క్రయవిక్రయాలను ఎప్పటికప్పుడూ రైతులకు అందించాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరుగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో కొనుగోళ్లు ప్రక్రియ పూర్తి కానుంది.

- ఛాయదేవి, మార్కెటింగ్ శాఖ ఏడీ, నల్లగొండ

'రంగులకల'గా మారిన

'రంగ స్థలం'



పుట్టుక.. చావు.. వారికి నాటక రంగమే. నాటకమంటే ఆ కళాకారులకి ప్రాణం. మూడురోజుల పసికందు మొదలుకుని ముదిమి వయసు మొహానికి రంగేసి వాళ్లను కూడా పాత్రల్లో దింపేయడం నాటకంపై, కళామతల్లిపై వారికున్న గౌరవాన్ని సూచిస్తుంది. హార్మోని వాయిస్తూనే ఒకరు, నాటకంలోని పాత్ర లో జీవిస్తూ మరొకరు.. ఇలా అకస్మాత్తుగా స్టేజీపైనే తనువు చాలించినా తమ కన్నీటిని పంటి బిగువున దాచి నాటకాన్ని రక్తికట్టిస్తూనే ప్రేక్షకులను రంజిపజేసి తమ వృత్తికే వన్నెతెస్తున్న కళామతల్లి బిడ్డలు, వారసత్వంగా వచ్చిన 'కళ' నానాటికి 'కళ తప్పినా' తమ జీవితం 'రంగుల కల'గానే మిగిలిందని తెలిసినా 'రంగస్థలం' ఊపిరిగా కొనసాగుతున్న నిజమైన కళాకారులు వాళ్లు. 'రంగస్థలం'లో పౌర సమాజం ప్రోత్సాహం కరువై దుర్భర జీవితాన్ని గడుపుతున్న 'సురభి' కళాకారులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

- (ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

సురభి కళాకారుల మాయాబజార్ నాటక ప్రదర్శన (ఫైల్)

సురభి నాటక సంస్థ కడప జిల్లాలో సుమారు 140 సంవత్సరాల క్రితం పురుడుపోసుకుంది. చక్రాయంపేట మండలం నాటిసొరుగు గ్రామంలో సుబ్బారావు అనే కళాకారుడు గోవిందరాయ నాట్యమండలిని స్థాపించి 'సురభి' కళాకారుల నాటక సమాజాలకు ఆద్యుడయ్యారు. గతంలో సుమారు 20 వరకు వివిధ పేర్లతో నాటక సమాజాలుండేవి. కాలక్రమేణా అవి నాలుగు సమాజాలుగా విజయభారతి నాట్యమండలి, శారదా నాట్యమండలి, భానోదయ నాట్య మండలి, వినాయక నాట్యమండలి మాత్రమే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో మిగిలాయి. వీటిలో విజయభారతి నాట్య మండలి, శారద నాట్యమండలి నాటక సమాజాలు గత 15 ఏళ్లుగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రాన్నే నివాసంగా ఉంటూ చుట్టు పక్కల నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు. భానోదయ నాట్య మండలి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్‌లో ఉంటుండగా, వినాయక నాట్యమండలి నాటక సమాజం మాత్రం ఇంకా కడప జిల్లాలోనే ఉందని సురభి కళాకారులు చెబుతున్నారు.

30 మంది కళాకారులు

నార్కట్‌పల్లి మండల కేంద్రంగా ఉంటున్న శ్రీ విజయభారతి నాట్య మండలి, శారదా నాట్య మండలి రెండు నాటక సమాజాల్లో కలిపి మొత్తం 30మంది చిన్నాపెద్దా ఆడా మగా కళాకారులు ఉన్నారు. వీరందరూ వారి వయసు, శారీరక ఆహార్యంకు తగిన పాత్రలను వేస్తారు. మొహానికి రంగువేసుకుని నాటకాలు వేయడం తప్ప మరొకటి తెలియని కళాకారులు వీరంతా. అది పౌరాణికమైనా... జానపదమైనా ఇట్టే పాత్రల్లో ఒదిగిపోగల 'కళాతృష్ణ' వీరి సొంతం. ప్రదర్శనలు ఉంటే పాత్రలు ధరించడం, లేదంటే నాటకాలకు కావల్సిన కాస్ట్యూమ్‌లను సొంతంగా తయారు చేసుకోవడం దినచర్యగా చేసుకుంటున్నారు.

నాటకంపై కరోనా ప్రభావం

సాంకేతిక విప్లవానికి తోడు వెండితెర జిలుగుల ఆకర్షణ వెరసి నాటక రంగానికి పెనుముప్పుగా పరిణమించినా కరోనా తర్వాత పరిస్థితులు నాటక రంగంపై మరింత దుష్ప్రభావాన్ని చూపాయి. కరోనాకు ముందు అడపా దడపా ఎక్కడో ఓ చోట నెలలో 10 నాటకాలైనా ప్రదర్శించే అవకాశాలు వచ్చేవి. కానీ కరోనా తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయి నేడు ఉచిత షోలు ప్రదర్శించినా చూడటానికి ప్రేక్షకులు రాని పరిస్థితిని 'సురభి' కళాకారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక్కో నాటక ప్రదర్శనలో సెట్టింగ్‌లు.. ఎఫెక్ట్‌లు కలిపికనీసం రూ.20,000కు తక్కువ కాకుండా ఖర్చు చేయాల్సి వస్తుంది. కానీ పట్టుమని పది మంది ప్రేక్షకులు కూడా రావడం లేదు.

స్టేజీపై వైభవం.. వాస్తవం దుర్భరం

స్టేజీపై వారిది వైభవమే. కానీ నిజ జీవితంలోకి తొంగి చూస్తే దుర్భరమైన పరిస్థితులు అయ్యో అనిపించక మానవు. పౌరాణిక నాటకాల్లో రాజసౌధాల్లో ఉంటూ... దాసీజనుల సేవలు పొందుతూ పంచ భక్ష పరమాన్నాలు తినే పాత్రల్లో పట్టు పీతాంబరాలు ధరించి దర్పం ఒలికించిన.. 'సురభి' కళాకారుల నిజ జీవితంలో నేటికీ ఏ ఒక్కరికీ సొంత ఇల్లు... కట్టుకోవడానికి మంచి బట్టలు లేవంటే అతిశయోక్తి కాదు. తమ పరిస్థితికి జాలిపడ్డారే తప్ప ఏనాడు కళామతల్లిని వీడలేదు. ఎండా.. వానలను భరిస్తూ రేకుల షెడ్డులోనే తమ జీవితాలను నెట్టుకొస్తున్నారు.

నాటక సప్తాహాలు వేయించాలి



పౌరాణిక చరిత్రల వైభవాలను నాటక ప్రదర్శనల ద్వారా నేటి తరానికి తెలియజేస్తున్న మా సురభి కళాకారుల జీవితాలకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. ఊరకే ఇవ్వకున్నా నాటక సప్తాహాలు ప్రదర్శించే అవకాశాలు కల్పించాలి. సాంస్కృతిక విభాగం ద్వారా నెలకు కనీసం రెండైనా ప్రభుత్వం తరపున ప్రదర్శనలు వచ్చేలా సహకరించాలి. వసతులు లేక రేకుల షెడ్డులోనే నివసిస్తూ ఎండకు, వానకు పడుతున్న ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోయేలా సొంతింటి కలను సాకారం చేసి మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి. ప్రజాపాలన కింద చేసిన దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి.

- హేమ, సురభి కళాకారిణి

ప్రభుత్వం ఆదుకోవాలి



మేం పుట్టిందే నాటకాలు వేసే ఇంట్లో. నాటకం తప్ప మాకు మరొకటి రాదు. నేను పుట్టిన మూడో రోజే 'కృష్ణలీలలు' నాటకంలో జైలులో దేవకీవసుదేవులకు జన్మించిన చిన్నికృష్ణుని పాత్రను వేయించారు. నేనే కాదు మా నాటక సమాజంలో ఇది ఓ ఆచారంగా వస్తుంది. శిశువుగా ఉన్నప్పటి నుంచి 74 ఏళ్ల ఈ వయసులో కూడా నాటకాలు వేస్తున్నాను. దీంతో మాకు ఇంకో పని తెలియకుండా పోయింది. సినిమాల కారణంగా నాటకాలను చూడటానికి ఎవరూ రావడంలేదు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

- వీ.శోభాదేవి, సురభి కళాకారిణి


సొంతిల్లు కట్టించి ఇవ్వాలి



నిలువ నీడ లేని తమకు ప్రభుత్వం సొంతిల్లు కట్టివ్వాలి. 15 ఏళ్లుగా నార్కట్‌పల్లిలోనే స్థిర నివాసముంటున్నాం. ఇక్కడే ఓటరు, రేషను కార్డులు ఉన్నాయి. నాటకాలేయడం తప్ప మరొక పని మా నాటక సమాజంలోని కళాకారులకు తెలియదు. ప్రస్తుతం నాటకాలకు ఆదరణ కరువై పిల్లలను కూడా చదివించుకోలేకపోతున్నాం. ప్రభుత్వమే మా పరిస్థితిని గుర్తించి ఇంటి స్థలం మంజూరు చేసి ఇందిరమ్మ ఇంటిని కట్టివ్వాలని కోరుతున్నాం.

- భాగ్యలక్ష్మీ, సురభి కళాకారిణి

రంగుల ప్రపంచం రంగుల కల కావొద్దు



వెండితెరకు ఆద్యమైన నాటక రంగం ఆదరణ కోల్పోతుంది. గత వైభవం నేడు దైన్యంగా మారింది. నాటక ప్రదర్శనల కోసం మా అపాయింట్‌మెంట్ తీసుకున్న పౌర సమాజం ఇపుడు మేం ఉచితంగా నాటక ప్రదర్శనలు వేస్తున్నా రావడం లేదు. ఈ పరిణామం మా రంగుల ప్రపంచాన్ని 'రంగుల కల'గా మార్చింది. ప్రభుత్వం తగిన విధంగా ప్రోత్సహించాలి. నాటక సమాజాలను ఆదుకోవడానికి తక్షణ చర్యలు చేపట్టాలి. నాటక సప్తాహాలకు అవకాశమివ్వాలి.

- ఉపేందర్, శ్రీ విజయభారతి నాట్య మండలి కార్యదర్శి,

ప్రభుత్వ సాయం అంతంత మాత్రమే

తెలుగు రాష్ట్రాలు కళలకు పుట్టినిల్లయినప్పటికీ పాలకుల నుంచి కళాకారులకు అందుతున్న సాయం అంతంత మాత్రమనే చెప్పాలి. మన ప్రాంత చారిత్రక, పౌరాణిక వైభవాన్ని తమ ప్రదర్శనల ద్వారా నేటికి సజీవంగా ఉంచుతున్న 'సురభి'లాంటి నాటక సంస్థలకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందటం లేదు. గతంలో ప్రభుత్వమే సాంస్కృతిక విభాగం ద్వారా నాటక సప్తాహాలు నిర్వహిస్తూ ప్రదర్శనలతో సురభి లేదా ఇతర నాటక సమాజాలకు కొంత ఆర్థిక దెరువును కల్పించేవి. కానీ నేడు సప్తాహాలు కూడా నిర్వహించక ముఖ్యంగా నాటకమే వృత్తిగా జీవనోపాధిగా చేసుకున్న సురభి కళాకారులు ఇబ్బంది పడుతున్నారు. సురభి సంస్థలోని రెండు నాటక సమాజాల్లో గల ఎనిమిదిమందికి కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ నుంచి రూ.5,000 చొప్పున అందేసాయం కూడా రెండేళ్లుగా నిలిచిపోయింది.



విజయ భారతి నాట్యమండలి షెడ్డు లోపలి భాగం

అందని అల్పాహారం

- రోజూ ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి పయనం అవుతున్న విద్యార్థులు
- చదువులపై దృష్టి సారించలేకపోతున్న విద్యార్థులు



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయం, సాయంత్ర నిర్వహిస్తున్నారు. వీరికి స్నాక్స్ అందించడం లేదు. ఫలితంగా ఇళ్లకు వెళ్లేందుకు ఆలస్యం అవుతున్నందున ఆకలితో ప్రత్యేక చదువులు సాగుతున్నాయి. విద్యార్థుల ఆకలి తీరాలంటే దాతలైనా ముందుకు రావాలి. లేదా.. ప్రభుత్వమైనా చొరవ తీసుకోవాలి.. గతంలో కొంత ప్రయత్నం జరిగింది. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితిపై ప్రత్యేక కథనం..

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తున్నారు. ఉదయం 8-30 గంటలకే స్టడీ అవర్స్ ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 7 గంటలకే బయలుదేరే విద్యార్థులకు వంట కాకపోవడం, పాఠశాలల్లో అల్పాహారం అందించకపోవడంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. పదో తరగతిలో శతశాతం ఫలితాల సాధనకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు సాధారణ బోధనతోపాటు సాయంత్రం అదనంగా గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉదయం వచ్చిన పిల్లలకు సాయంత్రం వేళ అల్పాహారం, స్నాక్స్ అందించకపోవడంతో ఆకలితోనే తరగతులు వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం అందించి ఆకలి తీర్చితే మరింత ఉత్సాహంతో చదివి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంది. పదో తరగతి విద్యార్థులు ఉదయం 9 గంటల వరకే పాఠశాలలకు వస్తున్నారు. దూర ప్రాంతాల వారు ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి బయలుదేరుతున్నారు. తోటి విద్యార్థుల మాదిరిగానే మధ్యాహ్నం 12-30 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. వీరికి ప్రతీరోజు సాయంత్రం 4-15 గంటల నుండి 5-15 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు తిరిగి ఇంటికి సాయంత్రం 7 గంటల వరకు చేరకుంటున్నారు. ప్రత్యేక తరగతుల్లో ఎలాంటి పౌష్టికాహారం అందించలేక పోవడంతో ఆకలితో విద్యార్థులు అలమటిస్తున్నారు. పాఠాలు అర్థం కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. వీరికి ఇంటి వద్ద కూడా సరైన పౌష్టికాహారం అందడం లేదు. అనారోగ్యానికి గురికావడంతోపాటు చదువులో వెనకబడే అవకాశం ఉంది.

పదో తగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందించేందుకు గతంలో మాదిరిగా దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉంది.

పథకం నిలిచిపోవడంతోనే ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉదయం 9 గంటలలోపు పాఠశాలకు చేరుకుంటారు. ఇంటి వద్ద ఏమీ తినకుండానే వస్తుంటారు. విద్యార్థులు అల్పాహారం తీసుకోకుండా రావడం వల్ల ఆకలితో ఇబ్బందులు తప్పడం లేదని భావించిన గత ప్రభుత్వం పాఠశాలల్లో అల్పాహారం పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఇడ్లీ, ఉప్మా, పొంగల్ అల్పాహారంగా ఇచ్చేవారు. ఈ పథకాన్ని మరింతగా మెరుగుపర్చాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు భావించినా కార్యరూపం దాల్చలేదు. నిలిచిపోయిన ఈ పథకాన్ని పురుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉంది.


ఉదయమే పాఠశాలకు వస్తా



యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామం మాది. ఉదయం 7-30 గంటలకే ఇంటి నుంచి భూదాన్‌పోచంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బ యల్దేరి వస్తాను. సాయంత్రం బస్సు సౌకర్యం సరిగా లేక ఇంటికి వెళ్లేసరికి సాయంత్రం 7-30 గంటలు అవుతోంది. సాయంత్రం అల్పాహారం అందిస్తే ఆకలి తీరుతుంది.

- వడ్డెమోని పల్లవి, భీమనపల్లి గ్రామం

దాతలు ముందుకు రావాలి



ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు అందించే అల్పాహారం అందించే విషయంపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతు లు నిర్వహిస్తున్నాం. వీరికి ప్రత్యేకంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్నాక్స్ వంటివి అందించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దాతలు ముందుకు రావాలి.

- ప్రభాకర్, ఎంఈవో,భూదాన్‌పోచంపల్లి

పదో తరగతి విద్యార్థులకే

అల్పాహారం పథకం నిలిచిపోవడంతో ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యాశాఖ గత నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో స్టడీ అవర్స్ నిర్వహిస్తోంది. విద్యార్థులు ఉదయం పాఠశాలకు 8 గంటలకు వచ్చి సాయంత్రం 5-15 గంటల వరకు ఉంటున్నారు. మధ్యాహ్న భోజన పథకం మధ్యలో తీసుకుంటున్నారు. ఈమధ్యన ఎలాంటి ఆహారం తీసుకోకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. వీరందరికీ అల్పాహారంతోపాటు స్నాక్స్ అందజేయాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు ఈ ప్రక్రియ ప్రారంభించలేదు. దీంతో సాయంత్రం వరకు విద్యార్థులు ఖాళీ కడుపుతో ఉంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో మొత్తం 5,944 మంది పదో తరగతి విద్యార్థులున్నారు.

మంచు కురిసే వేళలో..

తెలతెల్లవారుతుండగా మంచు కురిసి మురిసింది. భానుడి లేలేత కిరణాలు నేలను తాకే సమయమంలో శ్రమజీవులు బతుకుబాట పడుతుండగా, పశుపక్షాదులు పంట పొలాల్లో పరుగులు పెడుతూ సందడి చేశాయి.

(స్టాఫ్‌ఫొటో గ్రాఫర్-నల్లగొండ)




మంచులో పొలంగట్టున..



భానుడి తొలి పలకరింపు..



మంచులో వాహన వెలుతురులో..



తాటిచెట్టుపైకి గీతకార్మికుడు..



శ్రమజీవుల దినచర్య మొదలైన వేళ..

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

- కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు

భువనగిరి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు, గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని ముగ్ధమనోహరంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమ శాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు చేశారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో పర్వతవర్థిని సమేత రామలింగేశ్వరస్వామికి మహామండపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.28,25,011 ఆదాయం సమకూరింది.



నిత్య పూజల్లో భాగంగా హారతి ఇస్తున్న అర్చకుడు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

స్వామివారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు శనివారంతో ఆరో రోజుకు చేరుకున్నాయి. మానవుడు పక్షుల మాదిరి కాలాన్ని వృథా చేయకుండా జ్ఞానాన్ని పొందాలని, శకటాసుర సంహారం, పూతన సంహారాన్ని పాశురంలో పండితులు పఠించారు.

దాతల విరాళాలు

స్వామివారి దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాపడం పనులు కోసం అగ్గనూరు శివరామక్రిష్ణగౌడ్, స్వప్న, ఎన్ఆర్ఐ భాస్కరరావు దంపతులు రూ.లక్ష చెక్కు, మిర్యాలగూడ పట్టణానికి చెందిన సైదిరెడ్డి నిత్యాన్నదాన పథకానికి బియ్యాన్ని ఈవో భాస్కర్ రావుకు అందజేశారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	577.40
టీఎంసీలు	275.5168
ఎడమకాల్వకు నీటి విడుదల	6401
కుడికాల్వకు	7086
విద్యుత్ కేంద్రం ద్వారా	30,072
ఎస్ఎల్‌బీసీ ద్వారా	2,400 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	28,252
అవుట్‌ఫ్లో	46,259 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	644.23అడుగులు
టీఎంసీలు	4.28
ఎన్ని గేట్ల ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్ ఫ్లో	61.88 క్యూసెక్కులు

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

దేవరకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని కారు ఢీకొనడంతో అంకూరి ఎల్లమ్మ(58) అక్కడికి అక్కడే మృతి చెందింది. ఈ సంఘటన దేవరకొండ మండలం తూర్పుపల్లిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. దేవరకొండ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం తూర్పుపల్లికి చెందిన ఎల్లమ్మ భర్త కొన్నేళ్లక్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి ఎల్లమ్మ గ్రామంలో రోడ్డు దాటుతుండగా దేవరకొండ నుంచి కల్వకుర్తికి వెళుతున్న కారు ఎల్లమ్మను ఢీకొనడంతో అక్కడికి అక్కడే మృతి చెందింది. మృతురాలు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు ఢీకొని..


షేక్‌రియాజ్ మృతదేహం

చివ్వెంల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎదురుగా వచ్చిన బైకు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన షేక్ రియాజ్ వ్యవసాయ చేసుకుంటు జీవిస్తున్నాడు. ఈనెల 19వతేదీన రాత్రి 7గంటల సమయంలో సూర్యాపేట జిల్లా కేంద్రానికి వస్తుండగా మార్గమధ్యలో సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా అదే గ్రామానికి చెందిన అప్సర్ తన బైకుతో రియాజ్‌ను ఢీకొట్టడంతో గాయాలపాలైన రియాజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. రియాజ్ తండ్రి బాలసాహెబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.

3నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలు

మోత్కూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని బుజిలాపురం గ్రామంలో జనవరి 3 నుంచి 13వరకు నిర్వహించనున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని క్రీడల నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో కోరింది. పోటీల్లో పాల్గొన దల్చిన జట్లు రూ.800ఎంట్రీ ఫీజు చెల్లించి జనవరి 2లోగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా దాత మొగుళ్ల లక్ష్మారెడ్డి-స్వరూప రూ.25వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతిగా దాత చింతల విజయభాస్కర్‌రెడ్డి-వరలక్ష్మీ రూ.15వేలు, షీల్డ్ అందిస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు ఎండి.జాకీర్ (9182839702), సిహెచ్.నరేష్ (9182344013) జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఆవిరైన ఆనందం

- కొద్దిసేపట్లో గమ్యాలకు చేరుకునే లోపే అనంతలోకాలకు..
- డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు
- ఉర్సు ఉత్సవాల్లో ఆనందంగా గడిపి అంతలోనే విషాదం
- స్పీడు బ్రేకర్లు లేకపోవడం, డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణం


తల్లి మృతి చెందడంతో ఒంటరైన చిన్నారులు


ఘటనాస్థలిలో దెబ్బతిన్న వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

దేవరకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వారంతా వివిధ ప్రాంతాల నుంచి దేవుడి మొక్కులు తీర్చుకొని ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఉర్సు ఉత్సవాలు ముగిశాయి.. గమ్యం చేరాలని సన్నద్ధమవుతున్న తరుణంలోనే డీసీఎం మృత్యువు రూపంలో వచ్చి కబలించింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. దేవరకొండ పట్టణంలో శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమదానికి సంబంధించి దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతీ సంవత్సరం డిసెంబరులో డిండి మండలం ఎర్రారంనకు చెందిన ముతవల్లీలు హజ్రత్ ఖాదర్‌షావలీ పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉర్సు ఉత్సవాలకు డిండి మండలం ఎర్రారంతోపాటు హైదరాబాద్, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకొని కవ్వాలిలో తెల్లవారుజామున నాలుగు గంటల వరకు పాల్గొన్నారు. ఉదయం 6.30గంటల సమయంలో తిరిగి తమ, స్వగ్రామాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగానే కొండమల్లేపల్లి నుంచి దేవరకొండ మీదుగా పత్తిలోడు కోసం వెళుతున్న డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి దర్గా ముందు ఉన్న విశ్రాంతి గది వద్ద ఉన్న ముగ్గురుని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హజిమియా(50) తాటికోలు, అన్వర్‌పాష(19) మేడిపూర్, నబినాబేగం(25) హైదరాబాద్‌కు చెందిన వారు మృతి చెందారు. డీసీఎం వాహనం నగర్‌ఖానా(విశ్రాంతిగదిని) ఢీకొని నిలిచిపోకుంటే ఉర్సు ఉత్సవాల్లో పెను ప్రమాదం జరిగేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. డ్రైవర్ అంజిబాబు అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని బాధిత బంధువులు తెలుపుతున్నారు.

తల్లిని, చెల్లిని బస్టాండ్‌లో దింపి తండ్రిని తీసుకెళ్లేందుకు వచ్చి..

డీసీఎం వాహనం ఢీకొన్న సంఘటనలో మృతిచెందిన నాగర్‌కర్నూల్ జిల్లా మేడిపూర్‌కు చెందిన అబ్దుల్ ఖాదర్ ఉర్సు ఉత్సవాలు ముగిశాక తల్లి ఖైనిసాబేగం, చెల్లి సానియాబేగంలను దేవరకొండ బస్టాండ్‌లో ద్విచక్ర వాహనంపై దింపాడు. తండ్రి అన్వర్ దర్గా వద్ద ఉండడంతో అతన్ని తీసుకురావడానికి దర్గా వద్దకు వచ్చి విశ్రాంతిగది వద్ద వాహనంపై నిలిచి ఉన్నాడు. అంతలోనే డీసీఎం అతివేగంగా వచ్చి అబ్దుల్‌ఖాదర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందగా వాహనం ధ్వంసమైంది. పక్కనే ఉన్న తండ్రి అన్వర్‌పాష కాలు కూడా విరిగింది. తల్లిని, చెల్లిని బస్టాండ్‌లో దింపి తండ్రి కోసం వచ్చి అబ్దుల్‌ఖాదర్ మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అబ్దుల్‌ఖాదర్ అవివాహితుడు. అతని తండ్రి అన్వర్‌పాష సెంట్రింగ్ మేస్త్రీ పనిచేస్తూ మేడిపూర్‌లో ఉంటున్నాడు. కాగా అన్వర్‌పాష అత్తగారి ఊరు ఎర్రారం కావడంతో ఉర్సు ఉత్సవాలకు కుటుంబంతో కలిసి వచ్చాడు. ఉర్సుకు వచ్చి ఆనందంగా గడిపి కొద్దిగంటలలోనే రోడ్డు ప్రమాదంలో కుమారుడుని కోల్పోవడంతో అన్వర్‌పాషతోపాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా నబినాబేగం(25) అత్తాగారి ఊరైన ఎర్రారంకు భర్త ఖాదర్‌పాషతో కలిసి శుక్రవారం వచ్చి ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంది. ఆ దంపతులకు ఐదు సంవత్సరాల బాలుడు, రెండు సంవత్సరాల బాలిక ఉన్నారు. భర్త ఖాదర్‌పాష హైదరాబాద్ చంపాపేట్‌లో చికెన్‌సెంటర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి మృతి చెందడంతో చిన్నారులిద్దరు అమ్మ ఏదని కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురుని కన్నీరు పెట్టించింది. తాటికోలుకు చెందిన హజిమియాకు భార్య జాహంగీర్‌బితోపాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెల వివాహలు చేశాడు. ఉర్సు ఉత్సవాల్లో కొబ్బరికాయులు, పూజ సామాగ్రి, తినుబండరాలు విక్రయిస్తుంటాడు. శుక్రవారం ఉదయం నుంచి కొబ్బరికాయలు విక్రయించిన హజిమియా దర్గా సమీపంలోని విశ్రాంతి గది వద్ద నిలిచి ఉండగా డీసీఎం వాహనంఢీకొని మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించడంతో అక్కడున్నవారు కంటతడి పెట్టారు.

స్పీడు బ్రేకర్లు లేకపోవడమే..

దేవరకొండ పట్టణ శివారు కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై హజ్రత్ ఖాదర్‌షావలీ దర్గా ఉంది. రోడ్డు పక్కనే దర్గా ఉండడంతో ఉర్సు ఉత్సవాల్లో భక్తులతో రద్దీగా ఉంటుంది. శుక్రవారం కూడా ఉర్సు ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. జాతీయ రహదారిపై ఉండడంతో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతోనే ముగ్గురు మృతి చెందారని బంధువులు చెబుతున్నారు. స్పీడు బ్రేకర్లుంటే డీసీఎం వాహనం అదుపులో ఉండేదని చర్చించుకోవడం కనిపించింది.


ఘటనాస్థలిలో రోదిస్తున్న బంధువులు


ధ్వంసమైన విశ్రాంతి గది

డ్రైవర్ అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణం

కొండమల్లేపల్లికి చెందిన డీసీఎం డ్రైవర్ కొండమల్లేపల్లి నుంచి శనివారం ఉదయం బయలుదేరి దేవరకొండ మీదుగా గువ్వలగుట్ట పత్తి తీసుకురావడానికి బయలుదేరాడు. దర్గా వద్దకు రాగానే అతివేగంగా నిద్రమత్తులో దర్గా పక్కనే ఉన్న నగర్‌ఖానా విశ్రాంతిగదిని బలంగా ఢీకొనడంతో వాహనం నిలిచిపోయింది. విశ్రాంతిగదిని ఢీకొని డీసీఎం వాహనం నిలిచిపోకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. ప్రమాదానికి డ్రైవర్ అంజిబాబు నిద్రమత్తు, అతివేగమే కారణం.

ఒక్కొక్కరికి రూ.20లక్షల ఆర్థిక సహాయం అందజేయాలి

దర్గా ఉర్సు ఉత్సవాలకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.20లక్షల చొప్పున పరిహారం అందజేయాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రోడ్డు ప్రమాదవార్త తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని మృతులకు సంతాపం తెలిపారు.

బాట పంచాయితీ


చిట్యాల పట్టణం శివనేనిగూడెం సర్వేనెం.34లో వివాదానికి కారణమైన ప్రభుత్వ భూమి ఇదే

- శివనేనిగూడెం సర్వేనెం.34 చుట్టూ వివాదం

నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా చిట్యాల మునిసిపల్ పరిధిలోని సర్వే నెం.34లో ఉన్న ప్రభుత్వ భూమి 18ఎకరాల చుట్టూ వివాదం నెలకొంది. తహసీల్దార్ సహా స్థానిక రెవెన్యూ సిబ్బంది అండతో ఈ భూమిని కొందరు అక్రమంగా కబ్జాచేసి మట్టి తవ్వి విక్రయిస్తున్నారని, అంతేకాకుండా గుట్టల వెనకున్న భూములకు దారి లేకుండా చేసి ఇబ్బంది పెడుతున్నారంటూ మాజీ సర్పంచ్ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వివాదానికి ముగింపు పలకాలని, కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

20 ఏళ్ల క్రితమే ఈ భూమిలో దళిత కుటుంబాలకు పట్టాలు

శివనేనిగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వేనెం.34లో 20 ఏళ్ల క్రితమే ఇదే గ్రామానికి చెందిన దళితులు రుద్రవరం చంద్రమ్మకు రెండెకరాలు, రుద్రవరం చంద్రయ్యకు ఒక ఎకరం భూమిని ప్రభుత్వం అసైన్డ్ చేసి పట్టాలిచ్చింది. గుట్ట రూపంలో ఉన్న ఈ భూమిలో ఆ కుటుంబాలు చాలా ఏళ్లు ఎలాంటి సాగు చేపట్టలేదు. దీంతో ఈ భూమి మీదుగానే గుట్టకు అవతలివైపున ఉన్న భూయజమానులు డొంకదారి ఏర్పాటు చేసుకొని రాకపోకలు కొనసాగించేవారు. ఇటీవల ఈ ప్రాంతంలో భూములకు ధరలు రావడం, విలువ పెరగడంతో పట్టాలు పొందిన దళిత కుటుంబానికి చెందిన వారి కుటుంబీకులు వారి భూమిలో సాగుకు సన్నద్ధమయ్యారు. కొన్నేళ్లుగా ట్రాక్టర్లతో దున్నిస్తూ వానాకాలం పంటలు పండిస్తూ వచ్చారు. రుద్రవరం చంద్రమ్మకు చెందిన రెండు ఎకరాల భూమిని ఆమె ముగ్గురు కుమార్తెలు కలిసి పూర్తిగా చదును చేయించుకుని, చుట్టూ కంచె వేయించుకున్నారు. దీంతో ఈ భూమి మీదుగా గుట్ట అవతలకు వెళ్లే బాట మూసుకుపోయింది. నక్షాబాట కాకపోవడంతో మాజీ సర్పంచ్ దేవేందర్, అతడి సోదరుడు వారి పొలాలకు వెళ్లేందుకు దారి కోసం వీరితో గ్రామపెద్దల సమక్షంలో చర్చలు జరిపారు. గ్రామ పెద్దల తీర్మానం మేరకు చంద్రమ్మకు చెందిన భూమి ఒక పక్కనుంచి దారి తీయాలని తీర్మానించారు. ఇందుకు చంద్రమ్మ కుటుంబీకులు కూడా అంగీకరించారు. అయితే ఆ తర్వాత మళ్లీ పాతబాటనే కొనసాగించాలని గుట్ట అవతల భూములున్న మాజీ సర్పంచ్ కుటుంబీకులు పట్టుబట్టారని, తమ భూమి నుంచి దారి ఇచ్చేది లేదని చెప్పడంతో వివాదం మొదలయిందని చంద్రమ్మ మనువడు నవీన్ తదితరులు పేర్కొన్నారు. అయితే ఇదే విషయమై మాజీ సర్పంచ్ దేవేందర్ మాత్రం చంద్రమ్మకు ఇచ్చిన పట్టాకు సంబంధించి పొజిషన్ ఇవ్వలేదని, వారే ఇష్టానుసారంగా గుట్టను తవ్వి, బాట తొలగించి చదును చేశారని ఆరోపిస్తున్నారు. రెవెన్యూ సిబ్బంది అండతోనే ఇక్కడ భూమి కబ్జాకు గురైందని ఆరోపిస్తున్నారు. ఈ బాట తొలగించడంవల్ల తన తమ్ముడికి చెందిన పొలం ఎండిపోయిందని చెబుతున్నారు. ఇరువర్గాలు ఎవరి వాదన వారు చేస్తున్న క్రమంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని దళిత కుటుంబాలకు పట్టాలిచ్చిన భూమిని వారికి అప్పగించడంతోపాటు, మిగిలిన ప్రభుత్వ భూమిని గుర్తించి కంచెవేసి కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించలేదు

చిట్యాల మండలంలోని శివనేనిగూడెం సర్వే నెం.34లో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించలేదు. ఈ భూమిలో దాదాపు 20 ఏళ్ల క్రితమే రుద్రవరం చంద్రమ్మకు 2ఎకరాలు, రుద్రవరం చంద్రయ్యకు ఎకరం భూమిని అసైన్డ్ చేశారు. అది పోను మిగిలిన భూమి ప్రభుత్వం ఆధీనంలోనే ఉంది. వీరికి కేటాయించిన భూమిపై ఇప్పటికే సర్వే నిర్వహించాం. రెండు, మూడు రోజుల్లో సర్వే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

-కృష్ణ, తహసీల్దార్, చిట్యాల, నల్లగొండ జిల్లా

దారి ఇవ్వనందుకే ఆరోపణలు

మా అమ్మమ్మకు ప్రభుత్వం కేటాయించిన భూమిలోనే చాలా ఏళ్లనుంచి సాగుచేసుకుంటున్నాం. మా భూమి నుంచి వాళ్ల భూమికి దారి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. మేం పొలం మధ్యలో నుంచి దారి ఇచ్చే ది లేదని చెప్పడం వల్లే ఈ ఆరోపణలు చేస్తున్నారు. మేం మా కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన భూమినే చదును చేసుకున్నాం తప్ప ఇతర కబ్జాలేవీ చేయలేదు. ఇక్కడి సర్వేనెంబర్ 34లో మొత్తం భూమిని సర్వేచేయించి, అందులో అసైన్డ్ భూమి పోగా మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నాం.

-నవీన్, చంద్రమ్మ మనువడు

రెవెన్యూ శాఖ హద్దులు నిర్ణయించకుండానే

దేవేందర్, మాజీ సర్పంచ్, చిట్యాల, నల్లగొండ జిల్లా

సర్వేనెం.34లో రుద్రవరం చంద్రమ్మకు ఇచ్చిన భూమికి రెవెన్యూశాఖ ఇప్పటివరకు ఎలాంటి హద్దులు నిర్ణయించలేదు. వారు ఇష్టానుసారంగా భూమిని చదును చేసుకున్నారు. దీంతో మా సోదరుడి భూమికి వెళ్లే బాట మూసుకుపోయింది. దీంతో అతని పైరు కూడా ఎండిపోయింది. సర్వేనెంబర్ 34లో 15 ఎకరాల శిఖం భూమి ఉంది. అక్కడ ప్రభుత్వ భూమిలేదు. కొంత భూమి రోడ్డు కింద పోయింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపాలి.

రైతుబాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి


మూసీ కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

కేతేపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతుల బాధలు తీరుస్తున్న సీఎం రేవంత్ రెడ్డి రైతుబాంధవుడని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో యాసంగి సీజన్‌లో ఆరుతడి పంటల సాగుకు కుడి కాల్వకు ఆయన శనివారం రాత్రి సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి దేశానికి అన్నం పెట్టే రైతుల బాధలు తెలిసిన వ్యక్తి సీఎం కావడం గర్వ కారణమన్నారు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదలవుతున్న సాగు నీటిని ఆయకట్టు రైతులు పొదుపుగా వాడుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయకట్టు రైతుల అవసరాలను గుర్తించి ఎప్పటికప్పుడు నీటి విడుదలలో హెచ్చుతగ్గులు చేయాలని మూసీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె.లతీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కాంగ్రెస్ నాయకులు కోట మల్లికార్జునరావు, కందులమోహన్, మట్టి సాల్మన్, పి.ఇందిర, వెంకట్రాంరెడ్డి, జె.వెంకటనర్సయ్యయాదవ్, పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టాలి

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్


విలేకరులతో మాట్లాడుతున్న ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ రూ.50కోట్ల అవినీతికి పాల్పడ్డాడని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసు పెట్టిందని, అయితే రూ.లక్షల కోట్లు అవినీతికి పాల్పడిన వారిపై కేసులు పెట్టాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేటీఆర్ అవినీతికి పాల్పడితే కేసు పెట్టవచ్చని, మరి రియల్ ఎస్టేట్ దందాలు చేస్తూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై ఎందుకు ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీతో తెలంగాణ బంగారు తెలంగాణ అయ్యే ప్రసక్తిలేదని, ఇక బీజేపీ రాష్ట్రంలో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.7లక్షలకోట్లు అవినీతి జరిగిందని పదేపదే అనడం తప్ప ఒక్కరినీ అరెస్టు చేయలేదన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఐఏఎస్, ఏపీఎస్‌లను ప్రభుత్వం వదిలేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి జరగడంలేదని, గతంలో కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుంటానని చెప్పి పట్టించుకోలేదని, అభివృద్ధి జరగలేదన్నారు. కోమటిరెడ్డి సోదరులు ప్రజాశాంతిపార్టీకి మద్దతిచ్చి సర్పంచులను పెద్దఎత్తున గెలిపించినట్లయితే 100 రోజుల్లోనే అభివృద్ధి చేసి తీరుతానన్నారు. సోనియా గాంధీ కారణంగా కాంగ్రెస్ పార్టీ సర్వనాశనం అయిందన్నారు.

కొత్త బంధం.. పాత వంట

(5వపేజీ తరువాయి)

పొందాయి. మొత్తం వీరు 400కు పైగా వంటకాల తయారీ వీడియోలు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశారు. పాత తరం వంటకాలు, వాటి ప్రాధాన్యాన్ని ఈతరానికి తెలియజేస్తున్నామని, ఈ వంటలతో ఆరోగ్యంతో పాటు, అద్భుతమైన రుచి అందిస్తాయని సరస్వతి, సైదమ్మ చెబుతున్నారు.

చికెన్‌పచ్చడి వీడియోకు 34లక్షల వ్యూస్

చెఫ్ సరూ పేరుతో చేసిన వీడియోల్లో చికెన్ పచ్చడి వంటకానికి అన్ని సోషల్ మీడియా హ్యాండిల్స్ కలిపి 34 లక్షల వ్యూస్ వచ్చాయి. అదేవిధంగా నల్లేరు పచ్చడి వీడియోకు 3.20లక్షల వ్యూస్ వచ్చాయి. చాలా వీడియోలకు లక్షకు పైగా వ్యూస్ వచ్చాయి. చెఫ్ సరూ చానెల్‌కు యూట్యూబ్‌లో 2.66లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉంటే, ఫేస్‌బుక్‌లో 3.19లక్షల మంది, ఇన్‌స్టాలో 1.15లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ అత్తాకోడళ్లు ఇప్పటివరకు 400కుపైగా వంటకాల వీడియోలు అప్‌లోడ్ చేశారు.



ఇంత ఆదరణ రావడం సంతోషదాయకం

'చెఫ్ సరూ' యూట్యూబ్ చానెల్‌లో మేం సరదాగా చేసిన వంటల వీడియోలకు ఈ స్థాయిలో ఆదరణ రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ వీడియోల ద్వారా ఈ తరానికి తెలియని పాతతరానికి చెందిన పలు రుచికర వంటలు ఎలా చేయాలో రెసిపీ సహా వివరిస్తున్నాం. ఇలా వివరంగా చెప్పడం వల్ల ఈ వీడియో చూసేవాళ్లు ఆ వంటను వారు కూడా సులభంగా చేసుకోవడం కుదురుతుందనేది మా ఆలోచన. సరదాగా చేసిన ఈ ఆలోచనే మాకు ఉపాధిగా ఉపయోగపడడం సంతోషదాయకం. మా ఇంట్లో అందరూ సహకరిస్తుండడం వల్లే ఈ విజయం సాధ్యమైంది.

సరస్వతి, సైదమ్మ

జలాల్‌పూర్ చెరువులోకి దూసుకెళ్లిన కారు

ఇటీవల జరిగిన ప్రమాద స్థలంలోనే.. తప్పిన పెను ప్రమాదం


ధర్నా చేస్తున్న జలాల్‌పురం గ్రామస్థులు, చెరువులోకి దూసుకువెళ్లిన కారు (ఇన్‌సెట్లో)

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లు భూదాన్ పోచంపల్లి మండలంలో ఈనెల ఎనిమిదో తేదీన ఐదుగురి మృతికి కారణమైన జలాల్‌పూర్ చెరువుకట్టపై రోడ్డులోని మూలమలుపు మరోసారి ప్రమాదానికి దారితీసింది. శనివారం జలాల్‌పూర్ చెరువుకట్ట మూలమలుపు వద్ద ఓ కారు పల్టీకొట్టి చెరువులోకి దూసుకెళ్లింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హైదర్‌పూర్ గ్రామానికి చెందిన గూడూరు చంద్రారెడ్డి, సగ్గు ఎల్లారెడ్డి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. శనివారం భూదాన్‌పోచంపల్లిలో కెనరాబ్యాంకులో పని నిమిత్తం గూడూరు చంద్రారెడ్డి తన స్విఫ్ట్ కారులో సగ్గు ఎల్లారెడ్డితో కలిసి వస్తుండగా జలాల్‌పూర్ చెరువు మూలమలుపుకు రాగానే ఒక్కసారిగా కారు అదుపు తప్పి పక్కనే ఉన్న బారికేడ్లను ఢీకొట్టి చెరువులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరూ చెరువులో పడిపోయారు. వెంటనే చంద్రారెడ్డి తేరుకుని తన చేతులతో కారు అద్దాలను ధ్వంసం చేయడంతో.. ఇద్దరూ బయటకు వెళ్లారు. స్థానికులు ఘటనా స్థలానికి ఇరువురినీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

జలాల్‌పూర్ గ్రామంలోని చెరువుకట్ట మూలమలుపు వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నందున నివారణకు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్థులు డిమాండ్ చేశారు. శనివారం ఘటనా స్థలం వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామస్థులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. స్థానిక యువ నాయకుడు గోరంటి ప్రదీప్‌రెడ్డి తన సొంత నిధులతో మూలమలుపులోఉన్న కంప చెట్లను తొలగించారు. రోడ్డును విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు నల్ల లక్ష్మణ్, బైరు బాలరాజు. భారత భూషణ్, బైరు వెంకటేష్‌గౌడ్, మక్బుల్, పాలకుర్ల ఆగయ్య, కొయ్యడ నర్సింహ, బైరు బాలరాజు, కేసారం కృష్ణారెడ్డి, పాలకుర్ల నవీన్, బైరు భరత్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువుకట్ట పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు

జలాల్‌పూర్ చెరువుకట్ట మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చొరవతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రూ.20లక్షల నిధులు మంజూరు చేసిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేష్‌యాదవ్ తెలిపారు. త్వరలో ఈ చెరువుకట్ట మూలమలుపు వద్ద తగు చర్యలు చేపట్టేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు. శనివారం అసెంబ్లీ ఆవరణలోని సీఎం చాంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో బేస్‌మెంటుతో ఆగిపోయిన 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించాలని, దంతాలపల్లి- సూర్యాపేట మధ్య నూతనకల్ సమీపంలో గుండ్లసింగారం వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, మోత్కూరు, తిరుమలగిరి మండల కేంద్రాల్లో 30 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని, తిరుమలగిరిలో పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. దెబ్బతిన్న పంచాయత్‌రాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

బస్సు జాతను విజయవంతం చేయాలి

కట్టంగూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమ్యలను పరిష్కరించాలని ఈ నెల 25న నల్లగొండలో చేపట్టే బస్సు జాత బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు చెరుకు జానకి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశావర్కర్లతో కలిసి బస్సు జాత పోస్టర్‌లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు.కార్యక్రమంలో మండల కార్యదర్శి భూపతి రేణుక, సైదమ్మ, జ్యోతి, శైలజ , సంధ్య ఉన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కనగల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కనగల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు నేత్ర వైద్యుడు పుల్లారావు బహుమతులను అందజేశారు.

చదరంగంలో రాణిస్తున్న యువకుడు

జాతీయస్థాయి చేర్చిన అన్నతో సరదాగా ఆడిన ఆట

నాంపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకుంటున్నప్పుడు అన్నతో సరదాగా ఇంటి వద్ద ఆడిన ఆట నేడు ఆ యువకుడిని జాతీయస్థాయికి చేర్చింది. మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన పంబాల నాగరాజు చిన్నతనంలో తన అన్న విష్ణుతో కలిసి ఇంట్లో సరదాగా చెస్ ఆడేవాడు. నాగరాజు పుట్టుకతో 56 శాతం వినికిడి లోపాన్ని కలిగి ఉన్నాడు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు జడ్పీహెచ్ఎస్ పసునూరు, ఇంటర్ నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ కొండమల్లేపల్లిలోని వెంకటేశ్వర కళాశాలలో చదివాడు. డిగ్రీ చదువుతున్న సమయంలో మొట్టమొదటి సారిగా నల్లగొండలో 2018 సంవత్సరంలో మహాత్మ గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ చాంపియన్ షిప్‌లో పాల్గొని రెండో స్థానంలో నిలిచాడు. అలా జిల్లాస్థాయిలో ఆడుతూ అనేక బహుమతులు సాధించాడు. 2022లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఆలిండియా చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని మూడో స్థానంలో నిలిచాడు. 2024 సంవత్సరంలో బీఆర్ రాష్ట్రంలోని పాట్నలో నిర్వహించిన ఆలిండియా చెస్ డెఫ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని 6వ ర్యాంకు సాధించి 2025 జనవరిలో మైసూరులో జరిగే నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ చాంపియన్‌షిప్‌లో సెలక్ట్ అయితే ఏషియన్ పసిపిక్ డెఫ్ చాంపియన్‌షిప్‌నకు, అదేవిధంగా వరల్డ్ చెస్ ఒలంపియాకు ఎంపికై మన దేశం తరుపున ఆడనున్నాడు. వినికిడిలోపం కలిగి ఉన్న జాతీయస్థాయిలో చెస్‌లో రాణించడంతో గ్రామీణ స్థాయి యువతకు ఆదర్శంగా నిలువనున్నాడు.


చెస్ పోటీల్లో ఆడుతున్న నాగరాజు (ఫైల్)

వృథాగా కృష్ణానీరు


మునుగోడులోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి వెంట మిషన్ భగీరథ గ్రిడ్ పైపులు లీకేజీ దృశ్యం

మునుగోడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మునుగోడు ప్రధాన కూడలిలోని అరవీరుల చౌరస్తాలో గల ఆర్అండ్‌బీ రహదారి వెంట మిషన్ భగీరథ గ్రిడ్ పైపులు వేశారు. సోలిపురం గ్రామంతో పాటు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మిషన్ భగీరథ నీరు, జీపీ నీటి సరఫరా పైపులు ఉన్నాయి. ఇందులో మిషన్ భగీరథ పైపులు గతంలో లీకేజీలు కాగా మరమ్మతులు చేపట్టారు. అప్పట్లో నీరంతా వృథాగా పోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ అదే చోట లీకేజీ అవుతుండటంతో నీటి వృథా కొనసాగుతోంది. దీంతో నీరు కలుషితమవుతుండటంతో నీటి సరఫరా కొరత ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన కూడలిలో తరచూ సమస్య నెలకొనటంపై అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవటంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు లీకేజీలు శాశ్వతంగా మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా సమస్యల తమ దృష్టికి వచ్చిందని, మరమ్మతులు చేపడుతామని అన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తేనే విశ్వసనీయత : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

చిట్యాల, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తేనే ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మీద విశ్వసనీయత కలుగుతుందని సీపీఎ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. శనివారం చిట్యాలలో జరిగిన పార్టీ మండల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది గడిచినా ఆరు గ్యారంటీల్లో సగం కూడ అమలు కాలేదన్నారు. రైతులకు రుణమాఫీ పాక్షికంగానే జరిగిందని, రైతు భరోసా ఊసే లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని, డిండి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌పై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తామని చెబుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాని విధివిధానాలను బహిర్గతం చేయాలన్నారు. ఏడాది పాలనలో అసంతృప్తి మొదలైందని, హామీలు అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పట్టణ కార్యదర్శి బొబ్బల సుధాకర్‌రెడ్డి, అరూరి శ్రీను, పానుగుల్ల అచ్చాలు, కత్తుల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

కట్టంగూరు,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని మును కుంట్లలో శనివారం బీజేపీ మండలాధ్య క్షుడు పబ్బు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 188, 189, 190 బూత్ కమిటీ అధ్యక్షులుగా ముదుసు శంకర్, మడల హరికృష్ణ, ముక్క నర్సింహా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి గున్నాల నాగరాజు, పాదూరి వెంకట్‌రెడ్డి, కోమటి భాస్కర్ ఉన్నారు.

భూభారతితో రైతులకు న్యాయం


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌నాయక్

మర్రిగూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో రైతులకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ సభ్యులు రమావత్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. మర్రిగూడలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో ధరణి వల్ల అవకతవకలు జరిగి నిజమైన రైతులకు అన్యాయం జరిగిందన్నారు ధరణిలో జరిగిన భూక బ్జాలకు అరికట్టడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధరణిని రద్దు చేసి భూ భారతిని అమలు చేసిందన్నారు. సమావేశంలో రవినాయక్, చంద్రనాయక్, శ్రీను నాయక్, గణేష్ నాయక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చండూరు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇడికూడ గ్రామానికి చెందిన ఏరు కొండ సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన యువకులు, బోర్‌వెల్ డీలర్స్ కం డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు రూ. 23 వేలు పోగు చేసి శని వారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బోయపల్లి స్వామి, పులిజాల రవీందర్, నాంపల్లి పరమేష్, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

మునుగోడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన పలువురికి సీఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. గ్రామానికి చెందిన అనంతుల జ్యోతికు రూ. 26 వేలు, మునీర్ బాషాకు రూ. 24 వేలు, కమ్మంపాటి సురేష్‌కు రూ. 12 వేలు, కమ్మంపాటి రాజుకు రూ. 17.5వేలు, రాములుకి రూ.5.5 వేలు చెక్కు ను బాధితులకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు.

మూఢ నమ్మకాలను వీడాలి

నార్కట్‌పల్లి, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : ప్రజలు మూఢ నమ్మకాలను వది లేయాలని మానవహక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వీరస్వామి కోరారు. అక్కెనపల్లి గ్రామంలో మంత్రాల నెపంతో దాడి జరిగిన బిక్కంటి పుల్లమ్మ కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతికంగా ప్రపంచం ఎంతో పురోగతి సాధిస్తున్న ఇంకా మూఢ నమ్మకాలను పాటించడం ఆవేదన కలిగిస్తుందన్నారు. అనంతరం అక్కెన పల్లిలో అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలనీ నార్కట్‌పల్లి ఎస్ఐకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో చింతమల్ల గురవయ్య, ప్రధాన కార్యదర్శి అద్దంకి దశరథ, సీహెచ్. కాశీరాం, గడ్డం వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయ సేవా కమిటీ చైర్‌పర్సన్, సివిల్ జడ్జి మంజుల

కట్టంగూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవా కమిటీ మండల చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యావర్ అన్నారు. శనివారం అయిటిపాముల రైతు వేదికలో మం డల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సు లో ఆమె మాట్లాడారు. వ్యవసాయ చట్టాలు, రైతు సంక్షేమ పథకాలపై రైతులకు అవగాహన కల్పిం చారు. భూమిపై కోర్టు కేసులు ఉంటే ఉచిత న్యాయ సాయం లీగల్ సర్వీస్ ద్వారా సేవలు పొందవచ్చని తెలిపారు. తెల్లకాగితాలపై అమ్మకాలు, కొనుగోలు చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి షేక్ అరీఫ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శంకరయ్య, ప్రకాష్ రావు, ఓంకార్ ఉన్నారు.

కాల్వలకు నిధుల మంజూరుపై హర్షం


సీఎం, మంత్రుల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కట్టంగూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ధర్మారెడ్డిపల్లి కాలువకు రూ.123.98 కోట్లు పిలాయిపల్లి కాలువకు రూ.86.22 కోట్లు నిధులు విడుదల చేయడం పట్ల శనివారం కట్టంగూరులో ఎన్ఎస్‌యూఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కొమ్మనబోయిన సైదులు యాదవ్, ముక్కమాల శేఖర్, మహేష్, మదుసూదన్ రెడ్డి, కత్తుల శంకర్, వేముల సత్యానారాయణ, పరమేష్, గంజి సాయి, మహేష్, ఇంద్రారెడ్డి, వినోద్, నరేష్‌లు ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ సభలను జయప్రదం చేయాలి


కట్టంగూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

చండూరు రూరల్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను జయప్రదం చేయాలని ఎంఈవో ఊట్కూరి సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని బోడంగిపర్తి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సరస్వతి తో కలిసి ఆయన విద్యా, వైజ్ఞానిక మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రామలింగయ్య మాట్లాడుతూ ఈ నెల 28 నుండి 30 వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మి గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగే విద్యా, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రావిరాల రమేష్, యశోద, పెందోట నరేష్ పాల్గొన్నారు.

● కట్టంగూరు, (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ విద్యా వైజ్ఞానిక మహాసభల వాల్ పోస్టర్ శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలోఎంఈవో అంబటి అంజయ, ఆ సంఘం జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మిట్టపల్లి మురళయ్య, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుట్ట రాములు, దేశపాక కృష్ణ, హెచ్ఎం కె.బద్రి నారాయణ, కనకదుర్గ, రాజశేఖర్ రెడ్డి, మీనయ్య వెంకటేశ్వర్లు, మంగ ఉన్నారు.

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలి

నల్లగొండ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండలోని ఈ నెల 30,31 తేదీల్లో డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్‌మేళా నిర్వహిస్తునట్లు డీఈవో భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల నుంచి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠ శాలల నుంచి తప్పనిసరిగా రెండు ప్రాజెక్టులు సైన్స్ ఫెయిర్ ప్రదర్శించాలని పేర్కొన్నారు.

28నుంచి ఏపీజీవీబీలో సాంకేతిక సేవలు నిలిపివేత

చిట్యాల, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి);ఈ నెల 28 నుంచి 31 వరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో సేవలు నిలిచిపోతా యని చిట్యాల బ్రాంచ్ మేనేజర్ అల్లాడ సుజిత తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (ఏపీజీవీబీ) వచ్చే నెల 1నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు(టీజీబీ) గా మారనుందన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులను అందించాలి


షోరూమ్ ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, గుమ్ముల మోహన్ రెడ్డి

నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించి వారిని అభిమానని పొందాలని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో ప్రాఫిట్ షూ కంపెనీకి చెందిన 91 షోరూమ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ముందుగా 33వ వార్డు కౌన్సిలర్ బుర్రి చైతన్య జ్యోతి ప్రజ్వలన చేశారు. క్యాష్ కౌంటర్‌ను మునిసిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ ప్రారంభించగా మొదటి కొనుగోలును మహ్మద్ రెహ్మాన్ అహ్మద్ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆధునాతన షోరూం ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబం మొత్తానికి పాదరక్షకులు లభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోప్రాఫిట్ షూ కంపెనీ డైరెక్టర్ బత్తిని పేరయ్య, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే


శివన్నగూడలో ఫ్లోరోసిస్ బాధితుడిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

మర్రిగూడ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు రోజుల నుంచి మర్రిగూడ ప్రభుత్వాస్పత్రి సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఫ్లోరోసిస్ వ్యాధి గ్రస్తులను గుర్తించి పేర్లను నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా డా.దీపక్, శాలినీ మాట్లాడుతూ మండలంలో ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులను గుర్తించడానికి ఇంటింటి సర్వే చేస్తున్నట్లు చెప్పారు. మూడో రోజుల పాటు నిర్వహించిన సర్వేలో కొత్తగా ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తులు నమోదు కాలేదన్నారు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కేతేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కేతేపల్లిలోని డిపాల్ స్కూల్‌లో క్రిస్మస్ కేక్ కట్ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. డీపాల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ సాజి మాట్లాడుతూ లోకరక్షకుడు ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక,క్రిస్మస్ వేషధారణతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకుట్టుకున్నాయి.


డీపాల్ పాఠశాలలో బాలయేసు జన్మదిన నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు సామాజిక దేవాలయాలు

నార్కట్‌పల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు సామాజిక దేవాలయాలని వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీంద్ర అన్నారు. నార్కట్‌పల్లి ప్రభుత్వ జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శతశాతం సమీక్షలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆ గ్రామానికి ఆత్మ వంటిదని ప్రభుత్వ బడుల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. వందేమాతరం ఫౌండేషన్ ప్రాజెక్టులో భాగంగా పాఠశాల స్టడీసెంటర్ నుంచి లిటిల్ టీచర్‌గా ఎంపికైన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థుల స్వాన్ కోఆర్డినేటర్ దామర ఉదయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు పాల్గొన్నారు.

'అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి'

చిట్యాల, డిసెంబరు 21, (ఆంధ్రజ్యోతి);అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలనీ డీసీసీ కార్యదర్శి పోకల దేవదాస్ డిమాండ్ చేశారు. శనివారం చిట్యాలలో అమిత్‌షా వ్యాఖ్యలపై ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నల్లజెండాలు, బ్యానర్లతో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోంమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రజాసంఘాల నాయకులు జిట్ట నగేష్, పొన్నం లక్ష్మయ్య, గ్యార శేఖర్, పోకల అశోక్, ఆగు అశోక్, గాదె ఎల్లేష్, ఉప్పలపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

నార్కట్‌పల్లి (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ గురించి అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నార్కట్‌పల్లిలో మెయిన్ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను మంత్రివర్గం నుంచి తొలగిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ప్రజా సంఘాల నాయకులు చెరుకు పెద్దులు, కల్లూరి యాదగిరి, దండు రవి, కుమ్మరి శంకర్, బుల్లెద్దు సైదులు పాల్గొన్నారు.

సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల నిరసన

మునుగోడు (ఆంధ్రజ్యోతి): మునుగోడులోని బీఆర్. అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నల్లబ్యానర్లను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను అవమానిస్తూ విమర్శలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆసంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈచర్యలకు బాధ్యత వహిస్తూ బేషరతుగా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనుబంధ సంఘాల నేతలు వరికుప్పల ముత్యాలు, యాస రాణి శ్రీను, చిక్కుల నర్సింహా, వేముల లింగస్వామి, వంటపాక అయోధ్య, ఎర్ర మహేందర్, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.




మునుగోడులో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్

కట్టంగూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఫెస్టివల్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తల్లిదండ్రులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కట్టంగూరు హైస్కూల్ ఎంఈవో అంబటి అంజయ్య ఫుడ్ ఫెస్టివల్‌ను పరి శీలించి మాట్లాడారు. పండ్లు కూరగాయాల్లో పోషకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

● కేతేపల్లి(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఆహారోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల అభ్యసన తీరును సమీక్షించి, ఆరోగ్యం-ఆహారంపై అవగాహన కల్పించారు. కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పంచాయతీ కార్యదర్శి నాగమణి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించారు. మధ్యాహ్నం పోషకపదార్థాలతో కూడిన బిర్యానిఅందించారు.

● చిట్యాల (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహరంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చిట్యాల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గోగికార్ మాధవి తెలిపారు. శనివారం పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రతి మూడ శనివారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.123	200	220
సూర్యాపేట	రూ.125	180	210
నల్లగొండ	రూ.130	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 18.4

సండే స్పెషల్

SUNDAY SPECIAL

కొత్త బంధం.. పాత వంట

ఆ అత్తా కోడళ్లు వంటలు చేస్తూ తీసిన వీడియోలను యూట్యూబ్‌లో లక్షల మంది వీక్షిస్తున్నారు. ఈతరం వారికి రుచే కాదు పేర్లూ తెలియని వంటకాలనూ వీడియోల ద్వారా వీరు పరిచయం చేస్తున్నారు. ఆ అత్త తన కోడలికి ఆ వంట ఎలా చేయాలో? ఏ సీజన్‌లో ఏ వంటను ఎలా వండాలో వివరిస్తూ వీడియో చూసేవారికి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తుండడం వీరి ప్రత్యేకత. అద్భుతమైన రుచి వచ్చేలా వంట చేసేవిధానం, అందులో ఉపయోగించే పదార్థాలను వివరించడంతో పాటు, వంట చేసే క్రమంలో అత్తాకోడళ్ల మధ్య సరదా సంభాషణ, ఆ వంటకు అనుసంధానమయ్యేలా సాగే పిట్ట కథలు, సామెతలు వీక్షకులను రంజింపజేస్తున్నాయి. 'చెఫ్ సరూ' యూట్యూబ్ ఛానల్ ద్వారా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రానికి చెందిన సరస్వతి, ఆమె అత్త సైదమ్మ ప్రాచుర్యం పొందడంతోపాటు వారికంటూ ఓ ప్రత్యేకతను సాధించారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



వంట చేస్తున్న అత్తాకోడలు సైదమ్మ, సరస్వతి

సైదమ్మ కోడలు సరస్వతికి తొలినాళ్లలో అంతగా వంటలు వచ్చేవి కావు. దీంతో సైదమ్మ ఏ వంట ఎలా చేయాలి? ఎలా వండాలి? ఏ వంటలో ఉండే ప్రత్యేకతలేంటి? ఏ పదార్థాలు ఏ మోతాదులో వాడితే ఆ వంట రుచికరంగా ఉంటుంది? అనే విషయాలను కోడలికి వివరించేది. అలా కోడలికి వంట నేర్పే సమయంలో వీడియో తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేద్దామని ఆమె కుమారుడు నరేష్ సలహా ఇచ్చాడు. తొలుత సైదమ్మ వారించడంతోపాటు, తనకు చదువురాదని, తాను చేసే వంటలు వేరేవాళ్లు ఎందుకు చూస్తారని బిడియపడింది. కానీ ఆమె కుమారుడు, కోడలు ఒప్పించి వంటల వీడియోలు తీసి అప్‌లోడ్ చేయడం మొదలుపెట్టారు. అనూహ్యంగా వాటికి ఆదరణ లభించింది. తొలుత వీడియోలకు నెటిజన్లు ప్రతికూల కామెంట్లు పెట్టగా, ఓపిగ్గా వారికి సమాధానమిస్తూ ఆ సమస్యను అధిగమించారు. ఇప్పుడు ఆ సమస్య లేకుండా పోయిందని సరస్వతి తెలిపింది. కోడలినైనా తనను సొంత కూతురిలా అత్త సైదమ్మ చూసుకుంటోందని, వీడియోలు చూసేవాళ్లు పలువురు తమను అత్తాకోడళ్లేనా? అని అనుమానపడి అడుగుతుంటారని చెప్పింది. అత్త చేసే వంటలు, చెప్పే విధానంతోనే తాను కూడా వంట నేర్చుకున్నానని సరస్వతి తెలిపింది. తన భర్త

- యూట్యూబ్‌లో అత్తాకోడళ్ల వంటల విందు
- వ్యూస్‌తో దూసుకెళ్తున్న చెఫ్ సరూ
- కోడలికి వంట నేర్పే క్రమంలో మొదలైన ఆలోచన

నరేష్ డిజిటల్ మీడియాలో పనిచేస్తుండటం, అతడి ఆలోచన నుంచే ఈ యూట్యూబ్ వీడియోలు చేయాలని నిర్ణయించామని, కుటుంబ సభ్యుల పూర్తి మద్దతు వల్లే ఈ సక్సెస్ సాధించామని, వీడియోల రూపకల్పన సమయంలో అందరూ సహకరిస్తారని సైదమ్మ, సరస్వతి వెల్లడించారు.

త్వరలో ఫ్రాంచైజీల ఏర్పాటుకు సన్నాహాలు

వంట నచ్చిన చాలా మంది వాటిని వండి కొరియర్ చేయాలని కోరడంతో వీరు ఆ సేవలు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి గాజు సీసాల్లోనే పచ్చళ్లను వీరు అందిస్తున్నారు. వారు చేసే వివిధ వంటలను ఆఫ్‌లైన్‌లో ఫ్రాంఛైజీల ద్వారా కూడా విక్రయించాలని పలువురు కోరుతుండడంతో రాష్ట్రవ్యాప్తంగా 40కి పైగా కేంద్రాల్లో ఫ్రాంఛైజీలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని సరస్వతి తెలిపారు. బెల్లంటీతో పాటు ఆ ఫ్రాంఛైజీల్లో వీరి వంటకాలను కూడా అందుబాటులో ఉంచుతామని, దీని ద్వారా అత్త సైదమ్మ వీడియోల్లో చేసి చూపించే కూరలు, పచ్చళ్లు, ఇతర వంటకాలు అందరికీ అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

ఈ తరానికి తెలియని పాత వంటకాలకే ప్రాధాన్యం

సైదమ్మకు చిన్నప్పటి నుంచే వంటలు చేయడంలో పేరుంది. చిన్నప్పుడు అమ్మ వద్ద, అమ్మమ్మ, నాయనమ్మల వద్ద ఆమె ఎన్నో వంటలు చేయడం నేర్చుకుంది. వారి కుటుంబంలో ఏ ఫంక్షన్ అయినా ఆమెనే వంటలు చేసేది. వారి కుటుంబం పెద్దది కావడంతో రోజూ అందరికీ రుచికరమైన వంట చేసి పెట్టడం ద్వారా చక్కని వంట చేయడం అలవాటైంది. ప్రధానంగా ఈ తరానికి అంతగా తెలియని పాతకాలపు వంటలను వారి వీడియోల్లో వండి చూపిస్తుండటంతో వీక్షకుల ఆదరణ పెరిగింది. కొరమీను, కంది పచ్చడి, ఉలవ పచ్చడి, నల్లేరు పచ్చడి, ఆముదాల పాలతో సొరకాయ పచ్చడి, ఉలవచారు, ఉలవ రొట్టె, నాటుకోడి, రాగి అన్నం, సజ్జ అన్నం, మటన్ పులుసు వంటి వెరైటీ వంటకాల వీరి వీడియోలు ఎక్కువగా ప్రాచుర్యం...

- మిగతా 7వ పేజీలో...



ఆవిరైన ఆనందం

- కొద్దిసేపట్లో గమ్యాలకు చేరుకునే లోపే అనంతలోకాలకు..
- డీసీఎం రూపంలో వచ్చిన మృత్యువు
- ఉర్సు ఉత్సవాలలో ఆనందంగా గడిపి అంతలోనే విషాదం
- స్పీడు బ్రేకర్లు లేకపోవడం, డ్రైవర్ అతివేగమే కారణం



7

ఘటనాస్థలిలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం, కారణమైన డీసీఎం

వ్యవస్థీకృత నేరాల అదుపునకు చర్యలు



గంజాయి, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా లాంటి వ్యవస్థీకృత నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు మల్టీజోన్-2, యాదాద్రి ఇన్‌చార్జి డీఐజీ జోన్-5 వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించి కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందితో మాట్లాడి విధుల గురించి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు.

- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ వి.సత్యనారాయణ, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- ధాన్యం అక్రమ రవాణా అడ్డుకునేందుకు సరిహద్దుల్లో 24 చెక్‌పోస్టులు
- పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై పీడీ యాక్ట్
- రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ ఎస్‌హెచ్‌వోగా మార్పు
- మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తుండగా, దళారులు, కొందరు మిల్లర్లు, కమీషన్ ఏజెంట్లు పామ్-10 ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తెచ్చి రైతుల పేరుతో అక్రమంగా విక్రయించేందుకు యత్నిస్తున్నారని అన్నారు. వారిని కట్టడి చేసేందుకు సీఎం ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ అధికారులతో కలిసి పోలీస్‌శాఖ కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలో 24 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ధాన్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నామన్నారు. రైతుల పేరుతో మిల్లులకు ముతక ధాన్యం రవాణా చేస్తున్నామని దళారీలు సన్నధాన్యం తరలించేందుకు ప్రయత్నాలు చేయగా, పట్టుకొని వెనక్కి పంపామన్నారు. మరోసారి అలాగే చేస్తే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. రూరల్ పరిధిలో ఈ ఏడాది 18 పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులు నమోదు చేశామన్నారు. పేదల వద్ద చౌకగా కొనుగోలుచేసి రీసైక్లింగ్ అనంతరం విక్రయించే రైస్ కింగ్‌పిన్‌ల కోసం వేట సాగుతోందన్నారు. అక్రమ వ్యాపారులపై ఉక్కుపాదం మోపేందుకు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జోన్-2 పరిధిలో ఇప్పటికే రెండు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మిర్యాలగూడలో సైబర్ క్రైమ్‌లపై ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కేసుల పరిష్కారానికి స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాకు 80శాతం మేర తగ్గించినట్లు తెలిపారు. సుమారు వంద గ్రామాలకు ఎస్ఐ ఎస్‌ఎహెచ్‌వోగా ఉన్న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడా లేనంతగా కేసుల సంఖ్యను పెరిగినందున స్టేషన్‌ను సీఐ ఎస్‌హెచ్‌ఓగా మార్పు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. సరిహద్దు ప్రాంతంలో మూడు ఫ్యాక్షన్ గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. ఒక నక్సలైట్ లొంగిపోగా అతడి నడవడికపై నిఘా పెట్టడంతో పాటు ఫ్యాక్షన్ గ్రామాల్లో సంఘటనలు తలెత్తకుండా పర్యవేక్షిస్తున్నామన్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరిందని, అన్ని హంగులతో కూడిన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాని తెలిపారు. కార్యక్రమంలో రూరల్, వన్‌టౌన్ సీఐలు వీరబాబు, కరుణాకర్, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు వద్ద పటిష్ఠ బందోబస్తు

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): సరిహద్దుల్లో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం దామరచర్ల మండలం వాడపల్లి వద్ద రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ఆయన పరిశీలించి ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రవాణాను రాష్ట్రంలోకి అనుమతించకుండా చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. సరిహద్దు గుండా అక్రమ రవాణా జరగకుండా నిత్యం నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ వీరబాబు, ఎస్ఐ హరికృష్ణ ఉన్నారు.

బ్రాహ్మణవెల్లెంల కాల్వ పనులు ప్రారంభించాలి



కలెక్టర్ ఇలాత్రిపాఠి

ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు ఎడమ కాల్వ పనులను ఈనెల 25లోపు పూర్తిస్థాయిలో ప్రారంభించాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం కింద కాల్వల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.32కోట్లు విడుదల చేసిందన్నారు. అందులో భాగంగా ప్రత్యేకించి ఎడమకాల్వ పనులు ప్రారంభించాలన్నారు. ఈ కాల్వ వెళ్లే భూములకు సంబంధించి రైతుల నుంచి సేకరించిన పాస్ పుస్తకాలు, ఇతర ధ్రువపత్రాలు,అక్విటెన్స్‌లు సమర్పించి ఈ నెల 25లోగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ విఠలేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్



పవర్ లిఫ్టింగ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీడీ రాజ్‌కుమార్

గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో హ్యాండ్‌బాల్, హాకీ, ఫోర్స్ ఫిట్నెస్ క్లబ్‌లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు పేరు తీసుకురావాలని అన్నారు. ఐదు రోజుల పాటు నల్లగొండలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో వివిధ మండల స్థాయిలో ఎంపికైన బాల, బాలికలు ప్రతిభను కనబర్చారన్నారు. పలు క్రీడాంశాల్లో జిల్లాకు చెందిన యువకులు, విద్యార్థులు, బాలికలు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు.

జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి మాట్లాడుతూ, సీఎంకప్-2024 జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో 4వేల మంది యువకులు, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈనెల 27 నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులను పంపుతామన్నారు. హ్యాండ్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఇందిరా, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి విమల, అథ్లెటిక్స్, హాకీ, అసోసియేషన్ జిల్లా కార్యదర్శులు టీ.శంభులింగం, కరీం, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, పుల్లయ్య, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, మాణిక్యం, నాగరాజు, శ్రీనివాస్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

డీటీసీగా వాణి బాధ్యతల స్వీకరణ



నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా ఎస్.వాణి శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఉప్పల్ ఆర్టీవోగా పనిచేస్తున్న ఆమె పదోన్నతితో జిల్లా డీటీసీగా వచ్చారు. ఇప్పటి వరకు డీటీసీగా పనిచేసిన సురేష్‌రెడ్డి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు.

పరిశోధనలు సంక్లిష్టతలను సులభతరం చేస్తాయి

ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్



సమావేశంలో మాట్లాడుతున్న అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు సంక్లిష్టతలను సులభతరం చేస్తామని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎంజీయూలో 10రోజుల రీసెర్చ్ మెథడాలజీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మేనేజ్‌మెంట్ విభాగం జాతీయ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం ఆధ్యాపకులను, పరిశోధకులను భాగస్వాములను చేయడం ద్వారా ఎంజీయూ ప్రతిష్ఠ పెరుగుతోందన్నారు. రిజిస్ట్రార్, కోర్సు కోఆర్డినేటర్ అల్వాల రవి మాట్లాడుతూ, జాతీయ స్థాయి కార్యక్రమం ప్రేరణగా మరికొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మిర్యాల రమేష్, సరిత, వెంకటరమణారెడ్డి, లక్ష్మీప్రభ, నబీనా హెరాల్డ్, శ్వేత, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో భిక్షపతి

గుర్రంపోడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. శనివారం మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. పాఠశాల చుట్టూ చెట్లు, పొదలు లేకుండా శుభ్రం చేయించాలని పాఠశాల ప్రత్యేకాధికారికి సూచించారు. ఎలుకలు, పాములు ప్రవేశించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, స్టోర్‌రూమ్, కిచెన్‌లను తనిఖీచేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నోముల యాదగిరి, పాఠశాల ప్రత్యేకాధికారి విజయశ్రీ, తదితరులు ఉన్నారు.

బుద్ధవనంలో విద్యార్థుల సందడి



బుద్ధవనం సందర్శనకు వచ్చిన విద్యార్థులు

నాగార్జునసాగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ కేంద్రమైన నాగార్జునసాగర్‌లో శనివారం పర్యాటకులు, విద్యార్థుల సందడి నెలకొంది. సాగర్‌లో పర్యాటక ప్రాంతాలైన బుద్ధవనం, అనుపు, ఎత్తిపోతల, కొత్త వంతెన, పాత వంతెన, విజయవిహార్ తదితర ప్రాంతాల్లో పర్యాటకులు, విద్యార్థులు సందడి చేశారు. బుద్ధవనం సందర్శనకు జిల్లాకు చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు.

చివరి దశకు చేరిన

పత్తి కొనుగోళ్లు

6



- మరో 10 రోజుల్లో పత్తి సేకరణ పూర్తి
- క్రమక్రమంగా తగ్గుతున్న దిగుబడులు
- ఇప్పటికే 90శాతంకు పైగా పత్తి విక్రయం
- గత ఏడాది కంటే అధికంగా కొనుగోలు చేసిన సీసీఐ

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం.. ఆరోగ్యం



పెద్దచెరువు తీరంలోని ఉమామహేశ్వరాలయం



బోటింగ్ పార్కు



చెరువు తీరాన శివపార్వతుల విగ్రహం

మిర్యాలగూడ పట్టణ ప్రజలకు ఆహ్లాదం కల్పించడానికి గత ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మినీట్యాంకు బండ్‌లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా రూ.7 కోట్ల కేటాయించి మిర్యాలగూడ పట్టణంలో సుదీర్ఘ తీరమున్న పెద్ద చెరవు(పందిళ్లచెరువు)ను ఎంపిక చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసింది. పచ్చని పొలాలు, పచ్చిక బయళ్లతో ఈ చెరువులో మునిసిపాలిటీ, పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో బోటింగ్ పార్కు ఏర్పాటు చేశారు. పెద్ద బోటుతో పాటు రెండు స్పీడ్‌బోట్స్ మరో రెండు చిన్న పడవలు న్నాయి. దీంతోసెలవురోజుల్లో ఈ ప్రాంతమంతా స్థానిక పర్యాటకులతో కిటకిటలాడుతోంది. అంతేకాకుండాఈ చెరువు ఒడ్డున కొలువుదీరిన ఉమామహేశ్వరాలయం భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతోంది. చెరువు తీరాన ఆహ్లాదాన్ని పంచే పార్కు, ఆరోగ్యంగా ఉంచే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.

- (మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి)

హామీలను అమలు చేయాలి

చింతపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు బాదేపల్లి పులి రాజ్ గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. పింఛన్లు నేటికి అమలు చేయక పోవడంతో పింఛన్‌దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల నుంచి డబ్బు వసూలు చేస్తే చర్యలు : ఏఈ

దామరచర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మె నిర్మాణాల కోసం రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఏఈ అబ్దుల్లా హబీబ్ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.దిమ్మెలను కాంట్రాక్టర్ నిర్మించి రైతు లకు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. ఎవరైనా కాంట్రాక్టర్లు రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఫుడ్‌ఫెస్టివల్



ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కరస్పాండెంట్

హాలియా, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): హాలియా మునిసిపాలిటీలోని వీఎస్‌ఆర్ హైస్కూల్‌లో ఫుడ్‌ఫెస్టివల్, సెమీక్రిస్మస్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు సుమారు 50 రకాల వంటకాలను తయారు చేసుకొనివచ్చారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 30 నిమిషాల్లోనే వంటకాలను కొని తినేసి విద్యార్థులను ఆనం దింపచేశారు. అనంతరం సెమీక్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేష్

మిర్యాలగూడ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. శనివారం ఆ పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించేలా ప్రజలతో కలిసి ఉద్యమాలు కొనసాగించాలని అన్నారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీల్లో ఒకటి,రెండు తప్ప మిగతా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. అన్ని రకాల సమస్యల్లోనూ ప్రజలకు అండగా వుండి ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నూకల జగదీశ్ చంద్ర, పార్టీ వన్ టౌన్,టూటౌన్ కార్యదర్శులు మల్లుడ గౌతంరెడ్డి, పాండు పాల్గొన్నారు.

కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సౌండ్ బాక్స్‌లను అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ సభ్యుడు గుడిపాటి కోటయ్య

దామరచర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కస్తూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎంఈవో బాలాజీనాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగానాయక్ అన్నారు. మండలంలోని కల్లెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో భాగంగా కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు రూ.50 వేల విలువ గల సౌండ్ సిస్టం, జాతీయ నాయకుల చిత్ర పటాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలనే దృక్పథంతో బోధనోపకరణాలు, స్టడీ మెటీరియల్స్, మౌలిక సౌకర్యాలను కల్పిస్తూ దశాబ్దకాలంగా సేవలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ సభ్యుడు గుడిపాటి కోట య్యను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధీరావత్ పాచునాయక్, ఉపాధ్యాయులు గొబ్బూరి శ్రీనివాస్‌రావు, శ్రీదేవి, గురువారెడ్డి, లక్ష్మారెడ్డి, కవిత, నాగరాజు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో గణిత దినోత్సవం



ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు

కొండమల్లేపల్లి, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. రంగోలీ, క్విజ్, వ్యాసరచన, పాటలు, గణిత ఆధారిత ఎగ్జిబిషన్ పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

పెద్దవూర, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దారం పరమేష్‌యాదవ్, దుబ్బ అంజయ్య, తుదుం లింగయ్య ఇటీవల ప్రమాదంలో మృతిచెందగా ఈ విషయాన్ని తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి మండల పూజ

● *శరణుఘోషతో దద్దరిల్లిన అయ్యప్పస్వామి ఆలయం*

దేవరకొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): దేవరకొండ అయ్యప్పస్వామి ఆలయంలో మండలపూజ మహో త్సవం శనివారం కనులపండవగా నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటు శరణుగోషతో అయ్యప్ప ఆలయం దద్దరిల్లింది. స్వామివారికి పంచామృత అభిషేకం, పుష్పార్చన, మండలపూను గురుస్వామి చంద్రమౌళి స్వామి నిర్వహించారు. దేవరకొండ పట్టణంలోని భక్తులు మహోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం భిక్షను నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు నాగేశ్వర్‌రావు స్వామి, మధు సూదనచారి, సైదానాయక్, రాజరాం, శ్రీనివాస్, పాల్గొన్నారు.



దేవరకొండ : మండలపూజ మహోత్సవంలో అభిషేకం చేస్తున్న గురుస్వామి

హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలి:

చింతపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలని వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్ అన్నారు. మండలంలోని గొడుకొండ్ల వేణుగోపాల స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు శనివారం శరణుఘోష నామ సంకీర్తన నిర్వహించారు. పట్టణానికి చెందిన లగ్గోని యాదయ్య, అశ్విని ఇంట్లో సైతం స్వామియే శరణమయ్యప్ప అనే నామాన్ని అలపించారు. భక్తుల కోరికలు త్వరగా నెరవేరుతాయని ఆయన తెలిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదం, భిక్ష చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వైద్యుల ప్రవీణ్‌శర్మ, ఇడుకుళ్ల సుచిత్ర రాంమోహన్, గ్యార ఉమా యాదయ్య, కడారి జంగయ్య, సురిగి జంగయ్య, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, స్వాములు పాల్గొన్నారు.



మండల పూజకు హాజరైన భక్తులు



గొడుకొండ్లలో మాట్లాడుతున్న చైర్మన్ గోపాల్

మీట్ అండ్ గ్రీట్‌లో మాజీ ఎమ్మెల్యే భగత్



మాజీ ఎమ్మెల్యే భగత్‌ను సన్మానిస్తున్న ప్రముఖులు

హాలియా, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలో తెలంగాణ అసోసియేషన్(ఏసీపీ) నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పాల్గొన్నారు. దివంగత మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహ 4వ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం నోముల భగత్ మాట్లాడుతూ ఎవ్వరికీ సమస్య వచ్చినా ఎల్లప్పుడు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. అంతకు ముందు భగత్‌ను శాలువాతో సన్మానించారు.

సీపీఐ బహిరంగ సభ కరపత్రం విడుదల



బహిరంగ సభ కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

దామరచర్ల, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆవిర్భవించి వందేళ్ల సందర్భంగా ఈనెల 30న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్ కోరారు. సభ బలోపేతానికి రూపొం దించిన కరపత్రాన్ని శనివారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. బహి రంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ సయ్యద్, జిల్లా యాదగిరి, ధనావత్ శాంతి, వల్లంపట్ల వెంకన్న, కోటయ్య, ఉదయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



హాలియాలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

కొండమల్లేపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర 6వ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసాచారి కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం సభ విజయవంతానికి రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యే, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.భాను, ప్రకాష్, సంజీవ్‌కుమార్, చిన్న ముత్యాలు, నజీర్, శ్రీదేవి, శోభారాణి, కోటయ్యనరేందర్, శ్రీధర్,మధుసూదన్, నాగార్జున పాల్గొన్నారు.

● హాలియా,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ మహాస భలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మహాసభలు విజయవంతం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలకు మం డలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్ర మంలో అనుముల ఎంఈవో గుండా కృష్ణమూర్తి, హెచ్ఎం రుముల వెంకట్ రాంరెడ్డి, పెరుమాళ్ల వెంకటేశం, వడ్యా రాజు, రమాదేవి, కొడుమూరు వెంకట్ రాంరెడ్డి, ప్రశాంత్ కుమార్, మచ్చ సునీత, కృష్ణవేణి, మద్దెత ప్రసాద్, నాగేశ్వర్‌రావు, మహేష్, ముజాహిద్ అలీ, రవీందర్, పాల్గొన్నారు.

● డిండి, (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర 6వ విద్య వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలనిఆసంఘం నాయకులు పాపిరెడ్డి కోరారు. శనివారం స్థానికంగా రాష్ట్ర మహాసభల పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ మహాసభకు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, డాక్టర్ కె.శ్రీనివాస్, కుమారి ఐషిగోష్ ప్రధానవక్తలుగా హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు జి.రామారావు, ఎస్.పవన్, ఉపాధ్యక్షులు ఎం.సుజాత, ఖాజా రెహమత్, తిరుపతయ్య యాదయ్య, సరోజ, ధనమ్మ, అనిత పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ గుడిపల్లి మండలంలోని జడ్పీ పాఠశాలలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శులు పగిళ్ల సైదులు, అడావత్ చిన్నవెంకన్న, మాజీ జిల్లా కార్యదర్శి వై. శ్రీనివాస్, ఎంఈవో ఏ. వెంకటయ్య, ఎస్. శ్రీనయ్య, చాట్ల వెంకటయ్య, పి. జీవన్‌కుమార్, భాషిపాక జైపాల్, ఎం. సురేష్, కోశాధికారులు పి.వెంకటేశ్వర్లు, ఎన్. నాగేందర్, శివయ్య, రమణమ్మ పాల్గొన్నారు.

చేయూత

బీటెక్ విద్యార్థికి చేయూత



నవీన్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న గజ్జి మధుసూదన్

మాడ్గులపల్లి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిరుమర్తి గ్రామానికి చెందిన నక్క నవీన్ బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతడు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో గ్రామానికి చెందిన శ్రీసోమేశ్వర ధార్మిక పరిషత్ అధ్యక్షుడు, శివాలయ కమిటీ చైర్మన్ గజ్జి మధు సూదన్ అమృత వల్లి దంపతులు శనివారం రూ.10వేలు అందచేశారు. ఈ సందర్భంగా గజ్జి మధుసూదన్ మాట్లాడుతూ నవీన్ చదువు కోసం నాలుగేళ్లుగా ఏడాదికి రూ.10వేల చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు.. కార్యక్రమంలో కూరెళ్ల వెంకటాచారి, వల్లోజు ప్రసాద్, గొట్టిపర్తి లచ్చయ్య, వెంకన్న పాల్గొన్నారు.

బాల్య స్నేహితుల సాయం

పెద్దవూర, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుడుం రామలింగయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో అతడితో పాటు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1998లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం రామలింగయ్య కుటుం బాన్ని పరామర్శించి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో గోవిందరాజు, కృష్ణయ్య, రేబెల్లి రాజు, తిరుమల్ శివశంకర్, రవి, శ్రవణ్, నగేష్‌పాల్గొన్నారు.



రామలింగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు.

ఏసు బోధనలు శాంతికి మార్గదర్శకం: ఎస్ఐ సంపత్



కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ సంపత్

నాగార్జునసాగర్,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మార్గదర్శకం అని సాగర్ ఎస్ఐ సంపత్ అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో సెయింట్‌జోసఫ్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపా ధ్యాయులతో కలిసి కేక్ కట్‌చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధ నలు ఆచరణీయం అన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల నృత్యాలు పలువురిని ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో కరస్పాడెంట్ సిస్టర్ మతినా, హెచ్ఎం సిస్టర్ లలిత, సిస్టర్ క్లారా, శివకుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

బోరు పనుల అడ్డగింత

కొండమల్లేపల్లి,డిసెంబరు21(ఆంధ్ర జ్యోతి): మండలకేంద్రం లోని నల్లగొండ రోడ్డులో ఓ ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మరుగుదొడ్డి నిర్వాహణ నిమిత్తం నిబంధ నలకు విరుద్ధంగా రోడ్డు పక్కనే బోరు వేస్తు న్నారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ హుస్సేన్ శనివారం బోరును అడ్డుకున్నారు. ప్రధాన రహదారి పక్కనే బోరు వేయడం నిబంధులకు విరుద్ధమని తెలిపారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి డాకు నాయక్ బోరు పనులను నిలిపివేశారు.

భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలి



భగవద్గీత బహూకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఇస్కాన్ ప్రతినిధులు, విద్యార్థులు

హాలియా, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు శ్రీహలదర్ నీతాయి ప్రభు, రామలక్ష్మణ్‌దాస్ తెలిపారు. హాలియాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని 108 మంది మెరిట్ విద్యార్థులకు శనివారం భగవద్గీతను బహూకరించారు. ఈసందర్భంగా భగవద్గీత జ్ఞానాన్ని అర్థం చేసుకొని నిజ జీవితంలో పాటించాలన్నారు. నేటి బాలలు రేపటి పౌరులుగా తయరవ్వాలని ప్రతి ఒక్క విద్యార్థి భగవద్గీతను చదవాలని సూచించారు. ఇది మతపరమైన గ్రంథం కాదని, సమాజంలో మంచి, చెడులను గుర్తించి, జీవితం పరమార్థం గురించి వివరించే అతి పవిత్రమైన పుస్తకమన్నారు. అనంతరం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి కార్యక్రమానికి హాజరైన వారందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గుండా కృష్ణమూర్తి, కత్తి కోటిరెడ్డి, రవీందర్, శాగం కృష్ణారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, శైలజ, సైదిరెడ్డి, రవి, చామకూరి లింగారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, మాతాజీ, భాస్కర్ రెడ్డి, సతీష్, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.

25న సుశ్రుత గ్రామీణ వైద్యుల వార్షికోత్సవ సభ

కొండమల్లేపల్లి, పెద్ద అడిశర్లపల్లి డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈనెల 25న నిర్వహించనున్న సుశ్రుత గ్రామీణ వైద్యుల 18వ వార్షికోత్సవ సభ పోస్టర్‌ను కొండమల్లేపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద సంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు పాలకూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వార్షికోత్సవ సభలో భాగంగా సీజనల్, అంటు వ్యాధులపై అవగాహన, ఆడ పిల్లలు, అమ్మను కాపాడుకుందాం అనే కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామీణ వైద్యుడు మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కొండమల్లేపల్లిలో చామ దేవయ్య, పెరిక నాగరాజు, నరసింహగౌడ్, ఉట్కూరు వేమన్‌రెడ్డి, జెటమోని యాదయ్య, స్వామి, నందీశ్వర్ పాల్గొన్నారు. పీఏపల్లిలో జిల్లా ఈసీ మెంబర్ చామ దేవయ్య, పెరిక నాగరాజు, నరసింహగౌడ్, యాదగిరిగౌడ్, మంద నాగరాజు, ఎస్.కే రహీం, సైదులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.